# కోదండపాణి నాటకం

(సూర్యవంశపు ధనుస్సు)

రచన
**ఎన్. తారకరామారావు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2023**

# KODANDAPANI NATAKAM

By
**N. Taraka Rama Rao**

T.T.D. Religious Publications Series No. 1440
@ All Rights Reserved

First Edition : 2023

Copies : 500

Published by :
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 507

# ముందుమాట

**"వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే ।**
**వేదః ప్రాచేత సాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా!"**

త్రేతాయుగంలో శ్రీ మహావిష్ణువే లోకకల్యాణంకొరకు రాముడిగా అవతరించి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేశాడని శ్రీమద్రామాయణం చెపుతుంది. "రామో విగ్రహవాన్ ధర్మః" అంటే వేదోక్త ధర్మాన్ని ఆచరించి చూపించిన మనీషి శ్రీరామచంద్రుడు. కనుక రాముడు ధర్మానికి ప్రతీక. తండ్రిమాటలను జవదాటని తనయుడిగా, సోదరులను అభిమానించే అన్నగా, భార్య దూరమైనా నిరంతరం ఆమెకోసం పరితపించిన భర్తగా, ప్రజలక్షేమం కోసం పాటుపడే వ్యక్తిగా, వారి మాటలకు విలువనిచ్చే రాజుగా, ఎంతటి కష్టంలోనైనా ధర్మం తప్పకుండా మనిషి అనేవాడు ఎలా జీవించాలో చూపించినవాడు శ్రీరాముడు. తండ్రి ఇచ్చిన మాటకోసం కట్టుబడి అరణ్యాలకు వెళ్ళిన రాముడు ఇప్పటికీ, ఎప్పటికీ మనకు ఆదర్శమే. రామాయణంలో రాముడి లక్షణాలు గురించి వర్ణిస్తూ షోడశమహాగుణాలు ఆయనలో ఉన్నట్లు చెప్పారు. అయితే రాముడితోపాటు సీత, లక్ష్మణుడు, హనుమంతుడు భరతుడు మొదలైనవారు కూడా వారివారి ధర్మాలకు ప్రతీకలుగా నిలిచారు. సీతాదేవి పతివ్రతా ధర్మానికి ప్రతీక. లక్ష్మణుడు భ్రాతృధర్మానికి ప్రతీక. హనుమంతుడు స్వామి భక్తికి ప్రతీక.

రాముడిలో ఉన్న పదహారు గుణాలు మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దాయి. అవి గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మాత్ముడు, కృతజ్ఞతాభావం కల్గినవాడు, సత్యం పలికేవాడు, దృఢమైన సంకల్పం కలవాడు, చారిత్రం కలిగినవాడు, సకలప్రాణుల మంచికోరేవాడు, విద్యావంతుడు, సమర్థుడు, ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపించే సౌందర్యం కలవాడు, క్రోధాన్ని జయించినవాడు,

ధైర్యవంతుడు, తేజస్సు కలవాడు, ఎదుటివారిలో మంచిని చూసేవాడు. శ్రీరాముడు కోపగిస్తే దేవతలు సైతం భయాన్ని పొందుతారు. ఇవి ప్రతిమానవుడు కల్గి ఉండాల్సిన అవసరం ఉంది.

లౌకిక సంస్కృత వాఙ్మయంలో మొట్టమొదటి కావ్యం వాల్మీకి రాసిన శ్రీమద్రామాయణం. దీన్ని ఆధారంగా చేసుకొని మన భారతీయ భాషల్లో రామాయణాలు అనేకం వచ్చాయి. ముఖ్యంగా మన తెలుగుభాషలో అనేక దశ్య, శ్రవ్య రామాయణాలు వచ్చాయి. వాటిలో ఎన్. తారక రామారావు రాసిన ‘కోదండపాణి’ నాటకం ఒకటి.


ఈ కోదండపాణి నాటకం శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రామాయణం; శ్రీ ఇలపావులూరి పాండురంగారావు రచన – వాల్మీకి రామాయణంలో స్త్రీ పాత్రలు; గోపీనాథ రామాయణం – వాల్మీకి రామాయణం తులనాత్మక పరిశీలన అనే గ్రంథాల ఆధారంగా రాయబడ్డది.

ఆదికవి వాల్మీకి రామాయణంలో 7 కాండలున్నాయి. అదే విధంగా ఈ నాటకం 7 భాగాలుగా రాయబడింది. ఈ నాటకంలో వాల్మీకి రామాయణం రాయటం మొదలుకొని రావణ సంహారంవరకు చెప్పబడింది. ఇక్ష్వాకువంశంలో కోదండం పూజించినవారే కాని ధరించినవారు లేరు. వశిష్ఠుడు రామునికి ఈ ధనుస్సును (కోదండాన్ని) ధరించడానికి యోగ్యుడవు నీవే అని చెప్పి కోదండాన్ని రాముడికిస్తాడు. అప్పటినుండి రాముడు కోదండపాణి అవుతాడు. ఈ కోదండంతోనే రాముడు తాటకిని మొదలుకొని రావణుడి వరకు ఉన్న రాక్షసులందరినీ సంహరించి అజేయుడిగా నిలుస్తాడు. శ్రీమద్రామాయణం శ్రీరాముని మహోన్నత జీవితానికి దర్పణం. శ్రీరామ కథకు మూలాధారం సూర్యవంశపు ధనుస్సు అదే కోదండపాణి.



ఎన్. తారక రామారావు నాటకాన్ని సామాన్యప్రజలకు అర్థమయ్యే విధంగా వ్యావహారిక భాషలో సరళసుందరంగా రాయటం జరిగింది. దీన్ని చదివి పూర్తి రామాయణాన్ని (మూలాన్ని) చదివిన అనుభూతిని, ఆనందాన్ని పొందగలము. పాఠకలోకం “ఈ కోదండపాణి” నాటకాన్ని ఆదరిస్తుందని భావిస్తూ...

*సదా శ్రీవారి సేవలో...*



**శ్రీకార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

## విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | మొదటి అంకము | 1 |
| 2. | రెండవ అంకము | 10 |
| 3. | మూడవ అంకము | 17 |
| 4. | నాలుగవ అంకము | 25 |
| 5. | ఐదవ అంకము | 31 |
| 6. | ఆరవ అంకము | 44 |
| 7. | ఏడవ అంకము | 58 |


* * *

# మొదటి అంకము

## 'కోదండపాణి' (సూర్య వంశపు ధనుస్సు) – నాటకం

**వ్యాఖ్యాత:** శాస్త్ర పుష్పసమాయుక్తం విద్వద్భ్రమరశోభితమ్ సభాకల్పతరుం వన్దే వేదశాఖోపజీవితమ్

సభా సరస్వతికి నమస్కారం! సర్వచరాచర జీవకోటికి ప్రాణాధారం ప్రత్యక్షదైవం శ్రీ సూర్యనారాయణ స్వామి, ఆ సూర్యవంశస్థుల కథ రామాయణం.

రామాయణం అంటే రాముడు నడచిన దారి అని అర్థం. సత్యం, ధర్మం తప్పకుండా కష్టాలకు కృంగిపోక, రాముడు జీవనయానం చేసి సమస్త మానవాళికి ఆదర్శప్రాయుడు, పురుషోత్తముడు అయ్యాడు శ్రీరాముడు. సుఖదుఃఖాలను అనుభవిస్తూ మనిషి ఎలా జీవించాలో ఆచరించి–అనుభవించి–మానవాళికి మార్గదర్శి అయిన శ్రీరాముని కథ శాశ్వతం, అజరామరం.

కథ, ప్రబంధం, నాటకం, యక్షగానం, హరికథ, బొమ్మలాట, శిల్పం, చిత్రలేఖనం ఇలా అనేకానేక రూపాల్లో ప్రజలను శ్రీరామ కథ అలరిస్తుంది.

ఈ భూమండలంపై ప్రాణికోటితోపాటు రామ కథ ఆవిర్భవించింది. అందుకే శ్రీరామ కథాసుధ ఆదికావ్యం, అనాది కావ్యం. ఆదికవి వాల్మీకి. అందుకే "కూజంతం రామరామేతి – మధురం మధురాక్షరం, ఆరూహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్" అని తరతరాలుగా, యుగయుగాలుగా స్మరిస్తున్నారు కవులు, గాయకులు, విజ్ఞులు, ప్రాజ్ఞులు. శ్రీరామాయణం ఓ జాతి జీవితానికి దర్పణం. శ్రీరామ కథకు మూలాధారం సూర్యవంశపు ధనుస్సు, అదే కోదండపాణి.

(డాన్స్ – వినరో)

(తెర తొలగుతుంది)

(ఉదయించే సూర్యుడు చెట్లు, పుట్టలు, పక్షులు, పుష్పాలు, పారే నదీ ప్రవాహం భూమ్యాకాశాల మధ్య నిలిచిన ఓ ధనస్సు పాట...)

వినరోభాగ్యము రామకథ
పెనుబలమిదివో రామకథ
ఆది నుండి సంధ్యాది విధులలో
వేదంబయినది రామకథ
నాదించేనిదే నారదాదులచే
వీధి వీధులనే రామకథ
వదలక వాల్మీకి నుడిగిన
విదిత పావనము రామకథ
సదనంబైన సంకీర్తనయే
వెదకిన చోటనే రామకథ

(కీర్తనాచార్యుడు - శిష్యుడు ప్రవేశము)

శిష్యుడు : స్వామీ ఈ వింత చూడండి. భూమ్యాకాశాల మధ్య ధనుస్సు! ఏమాతేజస్సు?

కీర్తనా : అది సూర్య వంశపు ధనుస్సు

శిష్యుడు : అవునా? ఎంత అద్భుతం!

కీర్తనా : నాయనా ఇది తమసా నదీ తీరం, వాల్మీకి ఆవాస ప్రదేశం.

శిష్యుడు : వాల్మీకి అంటే రత్నాకరుడనే బోయవాడు.

కీర్తనా : అవును ఆ యుగంలో కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ భేదాలు లేవు.

“సత్యం మాతా–పితాజ్ఞానం
ధర్మోభ్రాతా–దయాసఖా
శాంతిః పత్నీ–క్షమా పుత్రఃషడేతే మమ బాంధవా”



అని నమ్మే సత్యకాలం. తపస్సు–ఇంద్రియ నిగ్రహము, బ్రహ్మజ్ఞానము–యజ్ఞ యాగ, తపో, జప అనుష్ఠానం. నిరతాన్నదానము–సదా ఆచరించే కాలం.

శిష్యుడు : కిరాతకుడైన వాడు వాల్మీకి ఎలా అయ్యాడు...?

కీర్తనా : భ్రమరం క్రిమినో, కీటకాన్నో తెచ్చి బంధించి దాని చుట్టూ పరిభ్రమిస్తుంది. దీన్నే “భ్రమర కీటక న్యాయం” అంటారు. కాలాంతరాన ఆ క్రిమి భ్రమరంగా రూపుదాలుస్తుంది. అనంత కాలం–రామనామస్మరణతో వల్మీకం లోంచి భ్రమర కీటక న్యాయంలా మనిషి ఋషిగా మహర్షిగా వాల్మీకి అవతరించాడు. అతడే ఆది కవి వాల్మీకి.

(ఇద్దరూ, ధనుస్సుకు నమస్కరించి వెడతారు. వాల్మీకి–భరద్వాజుడు ప్రవేశం)

(ఇద్దరూ ధనుస్సుకు నమస్కరిస్తారు, వాల్మీకి “రామ, రామ, రామ” అంటూ ప్రవేశం)

వాల్మీకి : భరద్వాజా అనుష్ఠానానికి అన్ని సిద్ధమా...?

భర : చిత్తం...సిద్ధం స్వామీ

వాల్మీకి : (వెళ్లబోతూ...) భరద్వాజా ఏం చూస్తున్నావు?

భర : స్వామి ఆ క్రౌంచమిథునాన్ని చూడండి ఎంత ప్రేమతో అన్యోన్యంగా కలిసిమెలసి ఉన్నాయో!

వాల్మీకి : నాయనా! జీవాత్మ–పరమాత్మలా ఆ పక్షులు జీవన రేఖపై జీవిస్తున్నాయి. భార్యాభర్తల అనుబంధానికి ఆత్మీయతకు చిహ్నంగా ప్రకృతి ధర్మాన్ని పాటిస్తూ లోకాలకు ఆనందం పంచుతున్నాయి.

(వాల్మీకి నదిలోకి వెళ్లి స్నానం చేసేలోగా భరద్వాజుడు దర్భలు పరచి అనుష్ఠానానికి ఏర్పాటు చేస్తుంటాడు–వాల్మీకి వచ్చి ధనుస్సుకు, సూర్యబింబానికి నమస్కరిస్తూ...)

సప్తాశ్వ రథమారూఢం–ప్రచండం కశ్యపాత్మజం
శ్వేతపద్మధరందేవం తం సూర్యమ్ ప్రణమామ్యహమ్
బ్రహ్మాస్వరూప ముదయే
మధ్యాహ్నేతు మహేశ్వరం
సాయంధ్యాయేత్సదా విష్ణుం
త్రిమూర్తంచ దివాకరం
తత్సవితుర్వ రేణ్యం–భర్గోదేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్

(వాల్మీకి అర్ఘ్యం విడుస్తాడు. భరద్వాజుడు అనుసరిస్తాడు)

(ఓ క్షణం తర్వాత అలజడి–పక్షులు, జంతువుల కలకలం వాల్మీకి – భరద్వాజులు చూస్తుండగా ఓ బాణం వచ్చి క్రౌంచమిథునంలో ఓ పక్షికి తగులుతుంది. ఆ పక్షి అరుస్తూ నేలవాలుతుంది. వాల్మీకి వెళ్లి ఆ పక్షిని చేతిలోకి తీసుకుంటాడు)

వాల్మీకి : ఎవరు... ఎవరు... ఈ ఘోరాన్ని తలపెట్టింది.

భర : అడుగో స్వామి నిషాదుడు...ఇలారా (నిషాదుడిప్రవేశం)

వాల్మీకి : నిషాదుడా ఎంత ఘోరాన్ని చేశావు? ఇవి జీవాత్మ పరమాత్మలా కలిసి బ్రతుకుతున్నాయి. జీవితాన్ని కలసి పంచుకుంటున్నాయి. వీటికి ఈ వియోగాన్ని ఎందుకు కల్పించావు...?

నిషాదుడు : స్వామీ వేటాడటం నా జీవనం.

వాల్మీకి : నిషాదుడా – నీ జీవనం కోసం మరొకరి జీవిత సౌఖ్యానికి అంతరాయం కల్పిస్తావా...



నిషాదుడు : ఇందులో తప్పేముంది స్వామి? తమరు భూమిలో దుంపలు, చెట్టు కాయలు తింటారు. మేం అడవి బిడ్డలం వేటాడి కష్టపడి సంపాయించుకుని బతుకుతాం.

వాల్మీకి : బ్రతకటం ముఖ్యమే! ఏ హానీ తలపెట్టని ఈ పక్షులలో ఒకదాన్ని చంపి మరొక దానికి వియోగం కలిగించావు ఇది ధర్మం కాదే?

నిషా : బలమున్నోడు బలం లేనివాడ్ని చంపడం తమరికెరుకేగా. ఆకలి తీరటానికి న్యాయం అంటూ చేతులు కట్టుకుంటే కడుపు నిండుతుందా స్వామీ.

వాల్మీకి : విషజంతువులను చంపడం లోకాచారం. కానీ నువ్వు చేసింది పాపం...తప్పక దీని ఫలితం అనుభవిస్తావు.

నిషా : ఏందోలే స్వామీ, మీకు అన్యాయం నాకు న్యాయం, ఐనా మీ న్యాయాలు, ఆచారాలు నాకెందుకు? నాకు బతుకు ముఖ్యం. పాపం, ఫలితం ఏందో...

వాల్మీకి : ఇది ధర్మమా – ఇవి నోరు లేని ప్రాణులే – ఎవరికీ అపకారం చెయ్యవే ఇలాంటి అకృత్యానికి పాల్పడకు

(వాల్మీకి చేతిలోని పక్షిని చూస్తూ)

“మా నిషాద! ప్రతిష్ఠాం
త్వమాగమః శాశ్వతీస్సమాః ।
యత్క్రౌంచమిథునాదేక
మవధీః కామమోహితమ్ ॥

భర : స్వామీ ఏదీ మరొక్కసారి ఆ శ్లోకాన్ని వినిపించండి.

వాల్మీకి : శోకంతో నేనన్నది

భర : శ్లోకమైంది స్వామీ

వాల్మీకి : (మళ్లీ ఆ శ్లోకం చదువుతాడు భరద్వాజుడు అదే శ్లోకాన్ని చదువుతాడు. ఆ తర్వాత...)

భర : స్వామీ అపూర్వం, అద్భుతం! తమ నోటి వెంట పాదబద్ధంగా, అక్షర సంఖ్య సమంగా గానానుకూలంగా శ్లోకం ఆవిర్భవించింది.

వాల్మీకి : అంతా భగవదనుగ్రహం, బ్రహ్మ సంకల్పం. నా శోకం నుంచి శ్లోకం రావడమేమిటి..? అంతా చిత్రంగా ఉంది.

భర : స్వామీ తమరు శ్రీరామనామం అనంతకోటి పర్యాయాలు స్మరించిన మాన్యులు, మహిమాన్వితులు. అందుకే మీ పలుకులలో సత్యం, ధర్మం, జ్ఞానం, వేదహితం ఏరులా జాలువారింది. కొనసాగించండి. సమస్త లోకాలకు హితమైన కావ్య రచనకు శ్రీకారం చుట్టండి.

(వాల్మీకి దర్భాసనంపై పద్మాసనం వేసుకు కూర్చుంటాడు ధ్యానముద్రలో అతడిపై కాంతి ప్రసరిస్తుంటుంది.)

(నేపథ్యంలోంచి స్త్రీ స్వరం)

మహర్షీ! నిరంతర రామనామస్మరణతో నీ జన్మ పావనమైంది. శోకం-శ్లోకంగా వెలువడింది. శ్రీరామకథ కావ్యంగా-రమ్యంగా-రమణీయంగా ఆచంద్రతారార్కం-నిత్యమై, సత్యమై నిలచేలా, వెలుగులు వెదజల్లేలా రచించు. శ్రీకారం చుట్టు. శుభం భూయాత్

వాల్మీకి : (మళ్లీ ఆ శ్లోకం చదువుతూ)

**కళ్యాణిరాగం**

వందే సూర్య శశాంకలోచనయుగం
వందే జగత్పావనం
వందే పత్ర సహస్ర పద్మనిలయం



వందే పురారి ప్రియం
వందే రాక్షస వంశనాశనకరం
వందే సుధా శీతలం
వందే దేవ కవీంద్ర కోటి వినుతం
వందే సదా రాఘవం

(శ్లోకానికి తగ్గ నృత్యం రంగస్థలంపై) (లైట్సాఫ్)
(లైట్సాన్) (ఆ తర్వాత కీర్తనాచార్యుడు-శిష్యుడు ప్రవేశం)

కీర్తనా : అలా రామ కథకు అంకురార్పణ జరిగింది. అష్టాక్షరి మంత్రంలో 'రా', పంచాక్షరీ మంత్రంలోని 'మ' రామ కథకుమూలం.

శిష్యుడు : స్వామీ! రామకథ యుగాలకు, కాలాలకు అతీతంగా, నిత్య నూతనంగా ఉండేందుకు కారణమేమిటీ? అందులోని కథా? కథనమా?

కీర్తనా : జీవిత సత్యాలు, మానవులు సదా ఆచరించి అనుసరించవలసిన సత్యధర్మాలు వివరించిన ఆది కావ్యం రామాయణం.

శిష్యుడు : స్వామీ! నీతి సూత్రాలు ధర్మ పన్నాలు ఇవేనా రామాయణంలో ఉంది.

కీర్తనా : కాదు నాయనా, సమాజ జీవనంలో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు, భార్యాభర్తలు, హితులు, స్నేహితులు, పరివారం, వీరందరి మధ్య ఉండాల్సిన ఆత్మీయత అనురాగ బంధాలు, ఆచరించాల్సిన విధులు, కర్తవ్యాలు, వీటి సారం రామాయణం.

శిష్యుడు : ఈ ధనుస్సు రామాయణ కథకు మూలం ఎలా అయ్యింది..?

కీర్తనా : నిషాదుడు బాణంతో క్రౌంచ మిథునాలలో ఒక దాన్ని కొట్టడం అది చూసిన వాల్మీకి నోట శోకం శ్లోకంగా వచ్చింది గదా! అంటే రామాయణ కథకు నాంది పలికింది ధనుస్సు. ఆ ధనుస్సు

పోనుపోను రామాయణ కథను అనేకానేక మలుపులు త్రిప్పుతుంది.

శిష్యుడు : స్వామీ! జీవపరిణామక్రమంలో అనేక జీవరాసులున్నాయి. రాముడికి ముందు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామావతారాలున్నాయి గదా! మరి రాముడి విశిష్టతేమిటీ?

కీర్తనా : నాయనా! ఈ సృష్టి అనంతం. భూ జలచరాలలో నిలువుగా వెన్నుపూసగల ప్రాణి మానవుడొక్కడే. అంటే మానవుడు అన్ని జీవరాసులకన్నా అధికుడు. వామన-నారసింహ-పరశు రామావతారాలు, వాటి లక్ష్యం, ప్రయోజనం వేరు. పరిపూర్ణ మానవుడుగా రాముడు రూపుదాల్చేందుకు ఆ అవతారాలు అంకురార్పణ చేశాయి.

శిష్యుడు : ఎలా...?

కీర్తనా : సృష్టిలో అంతవరకు నాగలి, గొడ్డలే ఆయుధాలు. నిలువుగా వెన్నుపూసగల మానవుడు సర్వ చరాచర జీవకోటిపైన, ప్రకృతి సంపదపైన, ఆధిపత్యం సంపాయించేందుకు ధనుస్సు ఆలంబనమైంది. ధనుస్సులా శరీరాన్ని వంచి, నారిలా సంధించి, సుదూర తీరాలలోని లక్ష్యాలను ఛేదించి రాముడు నాగరికతకు ఆద్యుడైనాడు.

శిష్యుడు : అంటే రాముడు, అతని జీవనం శ్రమజీవన విధానానికి చిహ్నామా..? భూమిలోని సంపదకు సీత తార్కాణమని, సముద్రుడు ఆ సంపదను కొల్లగొడుతుంటే రాముడు సముద్రానికి వారధి కట్టి మోహితుడైన రావణుడిని సంహరించి మానవజాతికి సంపదను తెచ్చి ఇచ్చి సమస్త మానవాళికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చాడంటారు. నిజమా?



కీర్తనా : నాయనా! నీవు చెప్పేది భౌతిక దృష్టి. కాని రామాయణ కావ్యం

కురురామ కథాంపుణ్యం
కావ్య రూపాం మనోరమాం
ప్రవిష్టాస్వాంచ కావ్యే ప్రతిశ్లోక సహస్రకం
విభక్తావయవాభూత్వా
చతుర్వింశతి ధాహ్యామాం

రామాయణ కావ్యం గాయత్రీ మంత్ర పూరితం. గాయత్రిలోని మొదటి అక్షరంతో రామాయణం ప్రారంభించి ప్రతి వెయ్యి శ్లోకాల్లో చివరగా గాయత్రిలోని అక్షరాన్ని నిక్షిప్తం చేయడంవల్ల వేల వేల సంవత్సరాలుగా ఆ కావ్యం అజరామరం అయ్యింది. రామాయణం సకల వేదశాస్త్ర సారం. సర్వకళల 'సమాహారమహాసాగరం నాయనా....

రామనామ పఠనచే మహివాల్మీకి
పరగబోయయయ్యి బాపడయ్యే
కులము ఘనము కాదు గుణమే ఘనంబురా
విశ్వదాభిరామ వినురవేమా.

- దశరథుడి కొడుకు దాశరథి.

- దశరథుడంటే-కర్మేంద్రియాలు-ఐదు. జ్ఞానేంద్రియాలు ఐదు-మొత్తం ఈ పదింద్రియాల అధిపతి దశరథుడు. ఓ రకంగా ప్రతి మనిషీ దశరథుడే.

* * *

# రెండవ అంకము

## 'కోదండపాణి' (సూర్య వంశపు ధనుస్సు) – నాటకం

### (దశావతారాల నృత్యం, కీర్తనాచార్యుడు–శిష్యుడు ప్రవేశం)

శిష్యుడు : స్వామీ! ఆర్యావర్తం–జంబూద్వీపం–భరత వర్షం–వేదభూమి అంటారు గదా, అంటే ఈ భూగోళంలో ఇంకే ప్రాంతాలు, దేశాలు ఉన్నాయి.

కీర్తనా : లేకేం నాయనా! త్రేతాయుగంలో ఆర్యావర్తంకాక, దేవావర్తము, బ్రహ్మావర్తము అన్న ప్రాంతాలున్నాయి. జంబూ ద్వీపం కాక, ప్లక్షద్వీపము, క్రౌంచ ద్వీపము, శాకద్వీపము శాల్మలీ ద్వీపము సండా ద్వీపము ఉన్నాయి. వీటన్నిటిలో ఆర్యావర్తము ప్రముఖమైంది. అందుకే వేద వేదాంగాలు ఇక్కడ పుట్టాయి. సృష్టి పరిణామ క్రమం ఇక్కడ ప్రారంభమైంది. నాగరిక జీవనానికి బీజం ఇక్కడ ప్రారంభమై దశదిశల విస్తరించింది.

శిష్యుడు : దశరథ మహారాజు పుత్రకామేష్టి యాగం గురించి చెప్పండి.

కీర్తనా : భారత దేశంలో రఘువంశం ప్రసిద్ధమైంది. ఆ వంశంలో పదవవాడు దశరథుడు. అతనికి పుత్రులు లేరు.

శిష్యుడు : చిత్తం...దశరథుడికి ముగ్గురు భార్యలు గదా!

కీర్తనా : అవును హ్రీ, శ్రీ.....కీర్తి అని.

శిష్యుడు : కౌసల్యా, సుమిత్ర, కైకేయి అని తెలుసు

కీర్తనా : లౌకిక నామాలు వేరు, అలౌకిక నామాలు వేరు. హ్రీ అంటే నమ్రత ఆమే కౌసల్య. శ్రీ అంటే సంపద సుమిత్ర. కీర్తికి ప్రతీక కైకేయి.



శిష్యుడు : అంటే దశేంద్రియాల మానవుడికి నమ్రత, సంపద, కీర్తి భార్యలన్నమాట.

కీర్తనా : అంతే నాయనా! మనిషి కీర్తికి బానిస కారాదు. దశరథుడు కీర్తికాంత యందు మోహితుడై పుత్రశోకాన్ని అనుభవించాడు.

శిష్యుడు : కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు అదుపు తప్పితే, కీర్తి కాంతకు దాసుడైతే, మిగిలేది–నిరాశ, నిస్పృహలే.

కీర్తనా : దశరథుడు అయోధ్యా నగరాధిపతి. అయోధ్య అంటే యుద్ధ మెరుగని నగరమని. ఆ నగరానికి గల విశిష్టితేమంటే.

సరయూనదీతీర సతతసన్మంగళ
    ప్రాభవోన్నత మహవైభవమ్ము
కనకగోపుర హర్మ్య ఘనకవాటోజ్వల ప్రాకార గోపుర శ్రీకరమ్ము
    గజవాజి రథభటగణి కాత పత్రచామ
రకేతుతోరణ మండితమ్ము
    ధరణీ వధూటి కాభరణ విభ్రమ రేఖ దరిపించు మాణిక్యదర్పణంబు

తేట : భానుకులదీప రాజన్య పట్టభద్ర
భాసి నవరత్న ఖచిత సింహాసనమ్ము
నాగనుతికెక్కు మహిమ సనాతనమ్ము
ధర్మనిలయమ్ము మహినయోధ్యాపురమ్ము

అదీ అయోధ్య నగర ప్రాశస్త్యం అక్కడ దశరథ మహారాజు సంతానం కోసం పుత్ర కామేష్టియాగం చేస్తున్నాడు.

(యజ్ఞ మంత్రాలు–యజ్ఞగుండం–ఋషులు–ఋత్విక్కులు–
మంగళవాద్యాలు–ఓ క్షణం తర్వాత ఉరుములు, మెరుపులు
దివ్యసంగీతం– యజ్ఞపురుషుడు ఆవిర్భావం దశరథుడు నమస్కరిస్తాడు.)

యజ్ఞ పురుషుడు : దశరథ మహారాజా! నన్ను ప్రాజాపత్య పురుషుడంటారు. నీ పుత్ర కామేష్టి యాగం సఫలం అయ్యింది. ఇదిగో, ఇది దేవనిర్మితమైన దివ్య పాయసం. నీ రాణులకు ఇవ్వు. శుభం కలుగుతుంది. నీ అభీష్టం తీరుతుంది.

(యజ్ఞపురుషుడు అంతర్ధానమవుతాడు. దశరథుడు దివ్య పాత్రతో వచ్చి వశిష్ఠుడికి నమస్కరించి)

దశ : వశిష్ఠ మహర్షీ...! తమ ఆశీర్వచనం – భగవదనుగ్రహం. ఇదిగో దివ్య పాయసం. ఎవరికి ఎలా ఎంతెంత ఇవ్వాలో – ఆజ్ఞాపించండి.

వశిష్ఠుడు : అయోధ్యాధిపతీ! దివ్య పాయసంలో సగభాగం కౌసల్యకు ఇవ్వు. మిగిలిన సగంలో సగం సుమిత్ర కివ్వు. ఆ మిగిలిన దాంట్లో సగం కైకేయి కివ్వు

దశ : ఇంకా సగం ఉంటుంది.

వశి : ఆ భాగం సుమిత్ర కివ్వు.

దశ : ఆజ్ఞ.

(లైట్సాఫ్)....(లైటాన్స్)

శిష్య : స్వామీ ఈ పంపకం విచిత్రంగా ఉందే..! ముగ్గురికి సమంగా పంచవచ్చుగదా...

కీర్త : నీది లౌకిక దృష్టి. వశిష్ఠుల వారిది ధర్మ దృష్టి. పూర్ణంలో సగం రాముడు–చతుర్ధాంశ భరతుడు–మిగిలిన అర్ధాంశంలో సగం–సగం లక్ష్మణ, శత్రుఘ్నులు.

శిష్య : సుమిత్రకే ఎందుకీ ప్రత్యేకత..?



కీర్త : కౌసల్య నమ్రత, సుమిత్ర సంపద, కీర్తికైకేయిగదా–నమ్రత ఉంటే సంపద. అదే సంపద కీర్తికి ఆధారం. అంటే సుమిత్ర – కౌసల్యకూ, కైకేయికీ అనుసంధానమైనది. సుమిత్ర అంటే అందరికీ మిత్రురాలు, ఆమె కౌసల్యలా ఏ దేశం నుంచీ రాలేదు. సుమిత్ర ఒక దేశానికి, ప్రదేశానికి చెందక, సర్వలోకాలకూ, కాలాలకు చెందినది. సమస్త మానవాళికీ తోబుట్టువు.

(లైట్సాఫ్)....... (లైటాన్స్)

(సూర్యధనుస్సుకు పూజ చేస్తూ దశరథుడు, ఆ ప్రక్కన వశిష్ఠుడు– వేదమంత్రాలు మంగళవాద్యాలు వినపడుతుంటాయి.)

(పాట....లేదా పద్యం....(విశ్వనాథవారి)

(కౌసల్య, సుమిత్ర, కైకేయిల సీమంతం నెలలు నిండి ప్రసవానికి సిద్ధమవడం)

వశిష్ఠుడు : దాశరథీ! నీకు పుత్ర జననం అయ్యే సమయం ఆసన్నమయింది. ఇది చైత్రమాసం, శుక్లపక్షం, నవమి, పునర్వసు నక్షత్రం, నాల్గవ పాదం...సూర్యవంశపు ధనుస్సుకు నమస్కరించి, తూర్పున ఉదయించే ఆదిత్యుడికి నమస్కరించి పుష్పాంజలి ఘటించు. ధనుస్సుని సంధించి బాణం వదులు.

(దశరథుడు అలా చేస్తాడు ఓ క్షణం తర్వాత దివ్య సంగీతం...పసి పిల్లవాడి కేరింత)

పద్యంలోంచి : మహాప్రభూ! కౌసల్యాదేవికి పుత్రోదయం అయ్యింది. (డాన్స్ నవమినాడు)

దశ : ఆచార్యా అంతా తమ ఆశీర్వచన మహిమ

**నేపథ్యంలోంచి పద్యం (కీర్తనాచార్యుడు)**

సీ॥ మొలకనవ్వుల వానివలరాజు, నలరాజు
వలపింపునవకంపు జెలువవాని

నరచెందురిని యండమిర వొందనను వొందు
పనమీరుమిసిమి నెన్నొల వాని
నలతమ్మి విరియమ్ములవిసొమ్ముగా గొన్న
గరువంపు దేరిసోగ కన్నులవాని
నెల మావి కనకావి చెలువులోగోని
చాలమురువుగాంచిన ముద్దుమోవువాని

తే॥ జారులక్ష్మణా శుభవిలాసములవాని
నచ్యుతార్ధాంశ మగువాని నరివిరాము
సకల గుణధాము రాముకౌసల్యగనియే
గలువదోర బూర్వదిక్సతిగన్నయట్లు –(గోపీనాథ రామాయణం)

వశి : అయోధ్యాపతీ! సూర్యుడు దయాద్రి పైవచ్చే సమయం ఆసన్నమయింది. దశమి, మీన లగ్నం, పుష్యమీ నక్షత్రం, ఉత్తర దిశగా పుష్పాంజలి ఘటించు. శుభం కలుగుతుంది.

(దశరథుడు ఉత్తర దిక్కుగా పుష్పాంజలి ఘటిస్తాడు. ఓ క్షణం తర్వాత శ్రావ్యమైన సంగీతం శిశువు కేరింత)

పద్యంలోంచి : మహాప్రభూ! కైకేయి మగ శిశువుకు జన్మనిచ్చింది.

దశ : మహర్షి నా జన్మ సాఫల్యమైంది. గురుకృప.

వశిష్ఠ : దాశరథీ! సూర్య ధనుస్సును ఏకాగ్రతతో భక్తిప్రపత్తులతో ఆరాధించు. ఆశ్లేషా నక్షత్రం, కర్కాటక లగ్నం రాగానే దక్షిణ పడమర దిశగా పుష్పాంజలి ఘటించు. ఆ సూర్యా నుగ్రహం వల్ల లక్షణమైన అజాత శత్రువులు సుమిత్రా నందనులుగా జన్మిస్తారు.



దశ : సప్తాశ్వరథమారూఢం
ప్రచండం కశ్యపాన్వయం
శ్వేత పద్మధరం దేవం తం
సూర్యం ప్రణమామ్యహం

(గంటలు మ్రోగుతుంటాయి...పక్షుల కిలకిలారావాలు...పసిపిల్లల నవ్వులు)

వశిష్ఠ : దాశరథీ! సుమిత్రా దేవికి కవల పిల్లలు జన్మించారు. చతుర్వేదాలకు ప్రతీకలుగా నీవు నలుగురు బిడ్డలకు తండ్రివయ్యావు. నీ పుత్రులు జగదేకారాధ్యులై ఈ సమస్త మానవాళికి సుఖసంతోషాలు అందిస్తారు. నీ కుమారులను కన్నులారా చూసి ఆనందించు...నీకు సమస్త సుఖాలు కలుగుగాక! అస్తు. సన్మంగళాని భవంతు...

(దశరథుడు... వశిష్ఠుడికి నమస్కరించి వెళుతుండగా....లాలిపాటలు రామాలాలీ మేఘశ్యామా లాలీ ...భజన పాట)
(లైట్సాఫ్)... (లైట్సాన్)

## కీర్తనాచార్యుడు - శిష్యుడు ప్రవేశం

కీర్త : అలా దశరథుడు సంతానం పొందాడు. ఇక్కడో విశేషం ఉంది. రామాయణం సప్తకాండ సమ్మిళితం. దశావతారాల్లో ఏడవది రామావతారం. రాముని జన్మతార పునర్వసు నక్షత్రాలలో ఏడవది.

శిష్య : స్వామీ! సంగీత స్వరాలు, వారాలు, సముద్రాలు అన్నీ ఏడవ సంఖ్యే.

కీర్త : వివాహం ఏడడుగుల బంధం, సూర్యభగవానుడి రథాశ్వాలు కూడా ఏడే. పైగా పద్నాలుగు లోకాల్లో ఎటు చూసినా ఈ భూమి ఏడవది.

శిష్యు : అద్భుతం, అపూర్వం. స్వామీ, అందుకే రామాయణం కాలానికి నిల్చి పరంపరాగతంగా ప్రాణులకు పారాయణ గ్రంథంగా నిల్చింది.

కీర్త : కురు రామ కథాం పుణ్యం కావ్యరూపాం మనోరమాం ప్రవిష్టాస్వాంఛకావ్యే ప్రతి శ్లోక సహస్రకం విభక్తావయ వాభుత్వా చతుర్వింశతి దాహ్యాహం

(లైట్సాఫ్)

* * *

## మూడవ అంకము

### 'కోదండపాణి' (సూర్య వంశపు ధనుస్సు) – నాటకం

**(రంగ స్థలంపై ధనుస్సు... రామ–లక్ష్మణులు–దశరథుడు–వశిష్ఠుడు)**

వశి : దశరథ మహారాజా! నీ కుమారుల విద్యాభ్యాసం పూర్తయింది. గుణవంతులు, జ్ఞానవంతులు, కీర్తిమంతులు, శ్రీమంతులు, సర్వజ్ఞులు...దీర్ఘదర్శులు అయిన కుమారులు గజారోహణ అశ్వారోహణ ధనుర్విద్యల్లో ప్రవీణులయ్యారు.

దశ : అంతా గురు కృప.

వశి : భరత శత్రుఘ్నులు కూడా సమస్త విద్యలు నేర్చారని కైకేయి రాజభవనం నుంచి వర్తమానం వచ్చింది గదా!

దశ : అవును స్వామీ...

వశి : రామచంద్రా! ఈ ధనుస్సు కోదండం. ఇది సూర్యవంశపు ధనుస్సు. పరంపరాగతంగా ఈ కోదండం మీ ఇంట పూజలందుకుంటున్నది. దీనిని సదా పూజించు. క్రీడించుటకు ఉపయోగించునది కావున కోదండమైనది. క్రీడ, వేట, యుద్ధములందే దీనిని ఉపయోగించాలని శాస్త్రాలు చెపుతున్నాయి. నువ్వు ధర్మరక్షణకుపయోగించు. ఈ కోదండపు నారి నాలుగు మూరలు, వింటిబద్దె ఇంకనూ పొడవు. కోదండము నుంచి విడచిన బాణమునకు తిరుగులేదు. అథర్వణ వేదములోని మహామంత్రములన్నియు కోదండవినిర్గత బాణోద్దిష్టములు. రామా! ఈ కోదండము ధరించిన వారి శక్తి కోదండమునకు, కోదండము శక్తి ధరించిన వారికీ లభిస్తుంది. మీ ఇక్ష్వాకు వంశంలో కోదండాన్ని పూజించిన వారేగాని, ధరించిన వారు లేరు. ఇందుకు నీవే యోగ్యుడవు. (వశిష్ఠుడు

కోదండాన్ని రాముడికిస్తాడు...రాముడు భక్తితో స్వీకరిస్తాడు) రామా ఇకనీవు కోదండపాణివి!

రాము : (వశిష్ఠుడికి నమస్కరించి) అంతా తమ ఆశీర్వచన ఫలం.

వశి : రామా! ఒక్కసారి నారి సంధించి సమస్త లోకాలకు ప్రాణి కోటికి నీ శక్తి తెలియచెయ్యి.

(రాముడు కోదండాన్ని సంధించి నారిని వీణలా మోగిస్తాడు)

(గుండెలదిరేలా శబ్దం...పిడుగు పడ్డట్టు ఉరుములు...మెరుపులు)

వశి : రామచంద్రా! రఘువంశానికి నీవు మణి దీపం. కోదండధారివైన నిన్ను చూడటం నా భాగ్యం. దశరథా! ఈ క్షణంలో రాముడు సహస్రకోటి కిరణాలతో ప్రచండభానుడిలా, ఆదినారాయణుడిలా ఉన్నాడు.

దశ : వశిష్ఠ మహర్షీ! రఘువంశానికి ఆచార్యులు మీరు. మీ ఆశీస్సులు, అనుగ్రహంతో నా జన్మ సార్థకమైంది.

(రామ-లక్ష్మణులు-దశరథుడు, వశిష్ఠుడికి నమస్కరిస్తారు. పశిష్ఠుడు ఆశీర్వదిస్తాడు. భటుడు ప్రవేశం)

భటుడు : మహారాజా! విశ్వామిత్రులవారు వస్తున్నారని వర్తమానం.

వశి : దశరథా...మహర్షి రాక శుభసూచకం. అర్ఘ్యపాద్యాదులిచ్చి సభక్తి పూర్వకంగా తోడ్కొని రా...

(రామ-లక్ష్మణ -దశరథుడు-భటుడు వెడతారు-వశిష్ఠుడు పూలమాలతో ఎదురు వెడతాడు. మంగళవాద్యాలు విశ్వామిత్రుడు రామలక్ష్మణుల భుజాలమీద చేతులేసుకుని ప్రవేశం)

వశి : బ్రహ్మర్షీ! స్వాగతం (పుష్పమాల విశ్వామిత్రుల మెడలో వేసి) ఇలా ఆశీనులు కండి.



విశ్వా : మీరు బ్రహ్మర్షీ అని పిలువడం నా పురాకృత పుణ్యం.

(విశ్వామిత్రుడు కూర్చోని)

వశిష్ఠ మహర్షి రఘువంశ గురోత్తమా! ఇలా నా సరసన ఆశీనులు కండి, మహద్భాగ్యంగా భావిస్తాను.

(వశిష్ఠుడు కూర్చుంటాడు)

దశ : ఆహా! ఏమీ నా భాగ్యము! జ్ఞానము – వేదము, తేజస్సు, ఓజస్సు, సత్యము, ధర్మము కలబోసినట్లుంది. మీ కలయిక. నే ధన్యుడను.

విశ్వా : దశరథా! యుక్తవయస్సులో ఉన్న రామ-లక్ష్మణులను చూడటం నాకూ అదృష్టమే.

దశ : మీ ఆశీస్సులే వారికి రక్ష ఏమి ఆజ్ఞ.

విశ్వా : కార్యార్థినై వచ్చాను. నే కోరినది కాదనవు గదా..!

దశ : నా భాగ్యంగా భావిస్తాను. ఏమి శెలవు.

విశ్వా : మాట తప్పవుగా...?

దశ : మీ పాదాల మీద ఆన. దశరథుడు ఆడిన మాట తప్పడమే... అదీ మీకిచ్చిన మాట.

విశ్వా : ఒకానొక సంకల్పంతో యజ్ఞదీక్షను స్వీకరించా. కామరూప సంచారులు, మహా బలసంపన్నులు – మారీచ, సుబాహులు నా యజ్ఞానికి విఘ్నం కల్గిస్తున్నారు.

దశ : ఇంతేగదా...నేను సర్వాధిపత్యం వహించి అక్షౌహిణి సైన్యంతో వస్తా-యాగరక్షణ చేస్తా

విశ్వా : నువ్వా! ఈ వయస్సులో. నే సంకల్పించిన యాగం దశరాత్రం. దాన్ని విఘ్నం చేయ సంకల్పించింది సుందోపసుందుల

కొడుకులు మారీచ-సుబాహులు. వీరికి ప్రేరణ సర్వరాక్షస జాతికీ అధిపతి రావణబ్రహ్మ. అంతటి వాళ్లను నిరోధించడం నీ వల్లకాదు.

దశ : మరి మార్గాంతరం?

విశ్వా : ఈ యువకిశోరాలు రామలక్ష్మణులను పంపు.

దశ : మహర్షీ! ముక్కుపచ్చలారని ఈ పసికూనలా రాక్షసులతో యుద్ధానికి?

విశ్వా : తండ్రివిగదా - నీకు వాళ్ళు పసికూనలే, కానీ వాళ్ళ శక్తి సామర్థ్యాలు నాకు తెలుసు.

దశ : మహర్షీ! ఎన్నో ఏళ్ళ నిరీక్షణ, పుత్రకామేష్టి యాగఫలితంగా జన్మించిన ఈ పసివాళ్ళు ఘోరారణ్యంలో కామరూపులైన రాక్షసులతో యుద్ధం చేయడమా, ఇది సాధ్యమా స్వామీ?

విశ్వా : దశరథా! ఇచ్చిన మాట గుర్తుంచుకో.

దశ : మహర్షీ ఆగ్రహం వద్దు. అనుగ్రహంతో మరోదారి చూపండి ఆచరిస్తా.

విశ్వా : దశరథా! మాట తప్పి రఘువంశానికి అప్రదిష్ట తేవద్దు. ఆ రాక్షసులను శపించడం నిరోధించడం నాకు అసాధ్యం ఏమీ కాదు. నే యజ్ఞదీక్షలో ఉన్నా అందుకే నీ సాయం కోరుతున్నా.

దశ : (దగ్ధస్వరంతో వశిష్ఠుడి వైపు చూస్తూ) ఆచార్యా!

వశి : దశరథా! ఆయన బ్రహ్మర్షి సృష్టికి ప్రతి సృష్టి చేసిన అపరబ్రహ్మ. క్షత్రియుడుగా సకల అస్త్రశస్త్రాలు ఔపోసన పట్టిన ప్రజ్ఞాశాలి. స్వయంశక్తితో జ్ఞాన, యోగ, సమాధిస్థితులు పొంది ధర్మానికి ప్రతిరూపంగా నిలిచిన ఆయనకు ఇచ్చిన మాట తప్పకు. అయ్యో



పసివాళ్ళే అన్న భ్రమ వీడు. వామనుడు, బలిచక్రవర్తిని జయించలా ఇదీ అంతే. పైగా విశ్వామిత్ర మహర్షి యోగ కారకుడు. నిగమాగమాలు తెల్సిన పరమ యోగి అతని వెంట రామ-లక్ష్మణులను పంపు. అంతా శుభమే జరుగుతుంది.

దశ : (తగ్గు స్వరంతో) తప్పదంటారా!

వశి : ఆలోచించకు, నీ కుమారులన్న నామ - రూప వ్యామోహం వదలుకో.

దశ : తమ ఆజ్ఞ శిరోధార్యం. కుమారులారా! ఇంత వరకు మీరు అపురూపంగా పెరిగారు. సుఖం, సంతోషం, సౌభాగ్యం ఇక్కడ లభ్యమయ్యాయి. కాని ఇప్పుడు మీరు వెళుతున్నది ఘోరారణ్యంలోకి. అక్కడ క్రూర మృగాలు, మాయా రూపులైన రాక్షసులు ఉంటారు. మీరు లేని అయోధ్య ఊహించటం నా వల్ల కాదు. మహర్షికిచ్చిన మాట తప్పలేక మిమ్మల్ని ఆయన వెంట పంపుతున్నాను. తండ్రిగా నేనిచ్చిన మాట నెరవేర్చటం మీ కర్తవ్యం. ఇహ ఆ స్వామి పాదాలే మీకు సదా రక్ష. ఆయన గీచిన గీటు దాటకండి.

(రామ-లక్ష్మణులు అందరికీ నమస్కరిస్తారు)

విశ్వా : సకల సన్మంగళాని భవంతు. అస్తు.

(లైట్సాఫ్. అందరూ వెడతారు. లైట్సాన్ కీర్తనాచార్యుడు - శిష్యుడు ప్రవేశం)

కీర్త : ఇక్కడ నుంచే రాముడి జీవన యానం ప్రారంభమైంది. "మార్జాల కిశోర న్యాయం"లా. అంటే పిల్లి తమ పిల్లలను సదా రక్షిస్తూ వాటిని స్వయం శక్తిమంతులను చేసినట్లే. మహర్షి విశ్వామిత్రులు - రామ లక్ష్మణులను తన వెంట విశాల ప్రపంచంలోకి తీసుకు

వెళ్ళాడు. వారికి సర్వశాస్త్రాలు, సకల అస్త్ర విద్యలు నేర్పి స్వయం శక్తిమంతులను చేశాడు.

శిష్యుడు : అంటే రామ-లక్ష్మణులు విశ్వామిత్ర మహర్షి అంతేవాసిత్వంలో కొదమసింహాల్లా ఎదిగారన్న మాట.

కీర్త : అవును నాయనా

(లైట్సాఫ్)

(సరయూనదీ తీరం)

విశ్వా : ఇది సరయూనదీ తీరం. బ్రహ్మమానససరోవరం నుంచి జారిన నది, సరయు. ఈ నది అల్లంతదూరాన గంగానదిలో కలుస్తుంది. మీరు వెళ్ళి పాదప్రక్షాళన చేసుకురండి.

(రామలక్ష్మణులు వెడతారు విశ్వామిత్రుడు సూర్యుడికి నమస్కరించి ధ్యాన నిమగ్నుడవుతాడు ఆ తర్వాత దర్భలు పరుస్తాడు. రామలక్ష్మణులు వస్తారు.) శ్రద్ధగా నే చెప్పే దివ్య మంత్రాలను సదా సాధన చేయండి. బల, అతిబలమంత్రాలను అనుగ్రహిస్తున్నా. వీటివల్ల దప్పిక, అలసట, శరీర బాధలు మీకు కలుగవు. విషపూరిత జీవులు మిమ్మల్ని బాధించవు.

(రామ-లక్ష్మణుల మీద కాంతి పడుతుంది. విశ్వామిత్రుడు ఇద్దరకు మంత్రోపదేశం చేస్తాడు. పై నుంచి అస్త్రాలు వస్తాయి. విశ్వామిత్రుడు వాటిని రామలక్ష్మణులకు అందిస్తాడు. కాంతి రామ-లక్ష్మణుల నుంచి విశ్వామిత్రుడి మీదనే ఉంటుంది. పద్మాసనం వేసుకుని తపస్సులో ఉంటాడు. రామ-లక్ష్మణులు విశ్రాంతి తీసుకుంటారు. కాలగమనం...ఆ తర్వాత సూర్యోదయం.)



విశ్వా : కౌసల్యా సుప్రజా రామా
పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూలా
కర్తవ్యం దైవ మాహ్నికమ్
(రామలక్ష్మణులు లేస్తారు)

రామ : స్వామీ! తమరు రాత్రంతా మేల్కొనే ఉన్నారా!?

విశ్వా : అవును రామా! ఇది ఘోరారణ్యం. రాక్షసులు కామరూపులు. ఏ రూపంలో ఏ క్షణంలో వారు మీకు అపకారం చేస్తారోనని. మీ రక్షణ నాదే కదా.

రామా : స్వామీ మీ యజ్ఞరక్షణకు మేం వచ్చాం. మీరేమో మా రక్షణ కొరకు ఇలా మేల్కోవడం.

విశ్వా : రామా! ఈ జగత్తుకు రక్షకుడు మహేశ్వరుడు. అందుకే ఆయన స్మశానంలో ఉండేది. క్షుద్ర, రాక్షస, పిశాచాలు, రాత్రిళ్ళు; సాధు ప్రాణులు పగలు సంచరించాలి. అది శివుడి ఆజ్ఞ. అది నియమం. కాని, మాయారూపులు, రాక్షసులు నియమాలను అతిక్రమించి విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. యజ్ఞహోమ క్రతువులు నిర్విఘ్నంగా సాగాలంటే వారిని నియంత్రించాలి. అదే మీ కర్తవ్యం... పదండి ముందుకెళదాం.

(కొంత సేపటికి ఉరుములు, మెరుపులు భయంకరమైన గాలి, ధూళి వికటాట్టహాసం)

విశ్వా : రామా! కోదండాన్ని సంధించు. తాటకి విధ్వంసాన్ని సృష్టిస్తున్నది.

రామ : స్వామీ - స్త్రీలను, బాలలను, వృద్ధులను సంహరించడం...

విశ్వా : ధర్మమే! రామా! నువ్వు క్షత్రియుడివి. ధర్మరక్షణకు క్షత్రియులు క్రూర కర్మలయినా చెయ్యాల్సిందే. పాపం, అపవాదు అని

సంశయించకూడదు. సర్వులకూ ఏది క్షేమమో, శ్రేయస్కరమో- అదే ఉత్తమ ధర్మం.

రామా : తమ ఆజ్ఞ. మా తండ్రి ఆనతి తలదాలుస్తున్నాం. లక్ష్మణా! సంధించు.

(క్షణం అరుపులు కేకలు మెరుపులు హాహాకారం)

విశ్వా : రామా! కనికరం చూపకు. సాయం సంధ్యాకాలంలో రాక్షసులకు బలపరాక్రమాలు అధికమవుతాయి. తాటకిని చంపు.

రామా : అవశ్యం. (బాణం వదులుతాడు)

(పెద్దగా కేక, తాటకి మరణం.)

విశ్వా : రామా! నీకు జయం. ఈ అరణ్యం ధనధాన్యాలు సమృద్ధిగా ఉన్న ప్రదేశం. శివుడు మన్మథుడి అంగాలను కాల్చిన దేశం కనుక అంగదేశం అయింది. ఇది మహిమాన్విత శివక్షేత్రం, ఈ రాత్రి మనం ఇక్కడే ఉందాం.

(డాన్స్ రామబాణం రామాయణం బిట్)

(రామ-లక్ష్మణులు విశ్వామిత్రుడికి నమస్కరిస్తుండగా...)

మంగళం కోసలేంద్రాయ
మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ
సార్వభౌమాయ మంగళం - శ్లోకం వస్తుండగా

లైట్సాఫ్

* * *

## నాలుగవ అంకము

### 'కోదండపాణి' (సూర్య వంశపు ధనుస్సు) - నాటకం

**(సిద్ధాశ్రమం యాగం జరుగుతున్నట్లు మంత్రాలు రామలక్ష్మణులు ధనుర్బాణాలతో రక్షణగా ఉంటారు. క్షణం తర్వాత గాలిదుమారం. రాక్షసుల కేకలు, రామలక్ష్మణులు బాణాలు వదలుతారు)**

వాయిస్ ఓవర్ : అబ్బా ! నాతల్లి తాటకను సోదరుడు సుబాహుడిని చంపారు. మీ ధనుర్విద్యా పాటవాన్ని, బలపరాక్రమాలను చూశా.

లక్ష్మ : ఎవరు నువ్వు? మాట వినబడుతున్నది రూపం కనబడుట లేదు.

వాయిస్ ఓవర్ : నన్ను మారీచుడంటారు. రామలక్ష్మణులారా! వదలను మిమ్మల్ని వదలను. ఇది సమయం కాదు, నా ప్రభువు రావణబ్రహ్మకు మీ అరాచకాలు చెబుతా, మళ్లీ వస్తా, మరో రూపంలో వచ్చి మీ పనిపడతా.

(నాటకీయతకోసం ఈ సన్నివేశం)

(వికటాట్టహాసం ఈ సన్నివేశం)

లక్ష్మ : ఆ మాయావి పన్నాగం విన్నావా

రామా : సోదరా - వీడు చతురుడు - అందుకే పలాయనం చిత్తగించాడు. చూద్దాం. సమయం వచ్చినప్పుడు దొరక్కపోడు అప్పుడే వీడిని వీడి ప్రభువునూ అంతమొందిద్దాం.

**(మంగళవాద్యాలు)**

సహనావవతు - సహనౌ భునక్తు.
సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీతమస్తు

మా విద్విషావహై
ఓంశాన్తి శాన్తి శాన్తిః

(యాగం ముగిసినట్లు – గంటలు)

(విశ్వామిత్రుడు రాక, రామ–లక్ష్మణులు నమస్కరించగా అక్షింతలు చల్లి తీర్థం ఇస్తాడు)

విశ్వా : నాయనలారా! దివారాత్రాలు నిద్రాహారాలు మాని యాగరక్షణ చేశారు. ఈ ప్రాంతంలో రాక్షస భయం తొలగింది. మునులు, మహర్షులు, తపయజ్ఞ, హెూమాదిక్రతువులు నిర్విఘ్నంగా కొనసాగించుకునేందుకు తోడ్పడ్డారు. సర్వదా మీకు శుభం కలుగుగాక.

రామ : అంతా తమ మార్గదర్శకత్వం స్వామీ.

విశ్వా : శుభం నాయనా! జనక మహారాజు మిథిలా నగరంలో యాగం చేస్తున్నాడు. ఆహ్వానం పంపాడు. అక్కడికే మన ప్రయాణం.

రామ : స్వామీ జనకుడు సూర్యవంశస్థుడే గదా! మరి ఈ జనక శబ్దం ఎలా వచ్చింది.

విశ్వా : రామా! సూర్యవంశానికి జనక వంశానికీ మూల పురుషుడు నిమి చక్రవర్తి. అతని పుత్రుడు ఇక్ష్వాకుడు. అతని పుత్రుడు ద్వీపాంతరాలకు వెళ్లి, వాణిజ్యాన్ని కొనసాగించాడు. వాణిజ్య శాస్త్రాన్ని కనుగొనడం వల్ల జనకుడైనాడు. మీ కుల గురువు వశిష్ఠుడు, వారికి జనకుడని నామకరణం చేశాడు. మిథిలాధిపతి జనకుడు ఆ పరంపరలోనివాడే.

రామ : స్వామీ తమరు అస్త్రశస్త్రాలే కాక, భూగోళ, ఖగోళ విజ్ఞానాన్ని అందించి మమ్ముల్ని కార్యదీక్షాదక్షులను గావిస్తున్నారు. ధన్యులం.



విశ్వా : పదండి ముందుకు సాగుదాం

(ముగ్గురు కొంత దూరం సాగుతారు పరిసరాలు మారుతాయి)

(లైట్సాఫ్ – కీర్తనాచార్యుడు – శిష్యుడు – లైట్సాన్)

శిష్యుడు : స్వామీ రామ కథకు అహల్య శాపవిమోచనానికీ సంబంధం అర్థం కావడం లేదు. రాముడు మానవుడే గదా ఆయన స్పర్శతో అహల్య శాపవిమోచనం పొందటమేమిటి?

కీర్త : రాముడు మానవరూపంలో ఉన్న నారాయణుడు. అది గుర్తించినవాడు విశ్వామిత్రుడు. గాయత్రి మంత్ర ద్రష్టకర్త. మానవజాతి కళ్యాణానికి, రాముడు వ్యక్తిగా ఎదగటానికి, గాయత్రీ మంత్రం గ్రాహ్యం చేసేందుకే రాముడిని వెంట తీసుకొచ్చాడు, అరణ్యాలలోకి విశ్వామిత్రుడు దశరథుడితో “అహం వేద్మి – మహాత్మానాం రామ సత్య పరాక్రమమ్” అంటే నేను, నా వెంట రాముడు ఈ విశ్వంలో పయనిస్తూ సమస్త మానవాళికీ శుభం, జయం, నిత్య సంతోషం కలిగిస్తాం అని చెప్పివచ్చాడు. అదేచేసి చూపాడు. అహల్య అనే భూమిని సస్యశ్యామలం చేసి దానికి దివ్యత్వం శాశ్వత కీర్తిమంతిత్వం కలుగ చేశాడు. అదే మానవ రూపంలో ఉన్న రామావతార విశిష్టత.

శిష్యుడు : స్వామీ పంచకన్యలలో అహల్య మొదటిది గదా! అంటే?

కీర్త : రామాయణంలో అహల్య, సీత, తార, మండోదరి వీరి ప్రస్తావనే ఉంటుంది. ఇహ అయిదవదయిన ద్రౌపది మహాభారతంలో వస్తుంది. అహల్యా దర్శనంతో ఆశీర్వచనం పొందిన రాముడు, సీతను కరగ్రహణం చేసే యోగ్యతను సంపాయించాడు. దశరథ రాముడు వేదోక్తమైన రామశబ్దానికి పరిపూర్ణత కల్పించాడు.

(లైట్సాఫ్ - లైట్సాన్)

(మిథిలానగరంలో వీధి - ప్రకటన డప్పు వాయిస్తు భటుడు)

భటుడు : మహాజనులారా అస్త్రశస్త్ర విద్యాప్రవీణులారా! నానా దేశ రాజన్యులారా! మిథిలానగర భూపతి జనక మహారాజు యజ్ఞ పరిసమాప్తి అయ్యాక సర్వజన సమక్షంలో సీతా స్వయంవరం నిశ్చయించారు. రండి మీ బలపరాక్రమాలు ప్రదర్శించండి. సీతాదేవి కరగ్రహణం చేయండి.

(డప్పు వాయించుకుంటూ వెడతాడు-లైట్సాఫ్-లైట్సాన్)

(రాజసభ-విశ్వామిత్రుడు-జనక మహారాజు వెనుక శివధనుస్సు)

జన : ప్రాజ్ఞులు-విజ్ఞులు-వేదవేదాంగ సమస్త అస్త్ర, శస్త్ర విద్యా నిపుణులు మంత్ర, యోగ-ధ్యాన ఇహపరదేవతా అనుగ్రహ పాత్రులున్న ఈ సభాభవనంలో వేంచేసిన మీకు ప్రణామం, స్వాగతం.

నా మనవి ఆలకించండి. నా కుమార్తె సీత అయోనిజ. ఆమెకు యుక్తవయస్సు వచ్చింది. ఎందరో ఆమెను వివాహమాడేందుకు వచ్చారు. ఆమెను బలపరాక్రమాలు గల క్షత్రియుడికే ఇవ్వాలని సంకల్పం. నేను ఆమెను 'వీరశుల్క' అని ప్రకటించా.

విశ్వా : జనక భూపతీ! బలపరాక్రమాలకు పరీక్ష ఏమిటీ...?

జన : మహర్షీ మా ఇంట పరంపరాగతంగా శివధనుస్సు ఉంది. మా జనక వంశీయులంతా సదా ఆ శివధనుస్సుని పూజించి ఆరాధిస్తున్నాం. అదిగో, అదే శివధనుస్సు. దానిని ఎక్కుపెట్టడమే వీరశుల్కం.

విశ్వా : ఎవరూ ప్రయత్నించలేదా



జన : ప్రయత్నించారు. కొందరు చూశారు. కొందరు పట్టుకుని మావల్ల కాదన్నారు. ఇంకొందరు కదిలించి చతికిలబడ్డారు. కొందరు, ఈ చాపము మా శివునిది, తాకుటయే మహాపాపమని వెనుదిరిగారు.

విశ్వా : ఈ యాగ పరిసమాప్తి కొచ్చిన వీరులెవరన్నా ప్రయత్నించవచ్చా!

జన : అవశ్యం. ప్రయత్నించమనండి మహర్షీ. మా సీత స్వయంవరం చేయించి నన్ను అనుగ్రహించండి.

విశ్వా : మిథిలాధిపతీ....అదుగో అక్కడ సూర్యచంద్రుల్లా ఉన్న రామలక్ష్మణులు దశరథ మహారాజు కుమారులు. నా యాగరక్షణ చేసిన వీరాధివీరులు. మీరు అనుమతిస్తే రాముడిని ఆహ్వానిస్తా.

జన : సహస్ర సూర్య తేజస్సుతో వెలుగొందే ధశరథాత్మజా, రామా ఇలా వచ్చి ఈ శివధనుస్సును సంధించు.

(రాముడు వచ్చి విశ్వామిత్రుడు, జనకుడికి నమస్కరిస్తాడు)

విశ్వా : సకల సన్మంగళానిభవంతు.

జన : కల్యాణమస్తు.

(రాముడు శివధనుస్సుకు నమస్కరించి, చేతిలోకి తీసుకుని సంధించబోగా పెళ్లుమని విరుగుతుంది.)

(హర్షధ్వానాలు మంగళవాద్యాలు)

జన : విశ్వామిత్ర మహర్షీ సీత వీరశుల్క అన్న నా ప్రతిజ్ఞ నెరవేరింది. నా కూతురు సీతను రాముడికి కన్యధారపోస్తా - ఏమంటారు?

విశ్వా : జనక భూపతీ! నీ నిర్ణయం సదా ఆచరణీయం. శుభమస్తు.

జన : రామా! ఏమంటావు.

రామ : ఈ కల్యాణానికి నా తండ్రి అనుమతి ఆశీర్వాదం కావాలిగదా!

విశ్వా : అవశ్యం. మిథిలాధిపతీ, రాముడికి ఈ లక్ష్మణుడితోపాటు భరత, శత్రఘ్నులనే తమ్ములున్నారు.

జన : స్వామీ! మా అమాత్యుడు శతానందుడు ఈ క్షణమే అయోధ్యవెళ్లి అయోధ్యాపతి దశరథులకు ఈ విశేషాలు చెప్పి అంగీకారం పొందుతాడు. వారినిక్కడికి ఆహ్వానిస్తాడు. అంతేగాదు ఊర్మిళను లక్ష్మణుడికి, నాతమ్ముడు కుశధ్వజుడి కుమార్తెలు శ్రుతకీర్తి, మాండవిలను భరత, శత్రుఘ్నులకు పాణిగ్రహణం చేయించాలని నా అభిలాషగా విన్నవిస్తాడు.

విశ్వా : మంచి సంకల్పం. జనక మహారాజా అయోధ్య - మిథిల రాజ కుటుంబాల కలయిక అపూర్వం. నా మాటగా వశిష్ఠుల వారికి ఈ విన్నపం తెలియ చెయ్యి. ఉత్తర ఫల్గుణీ నక్షత్రం, పగలు ఈ వివాహ వేడుకలకు శుముహూర్తం.

జన : స్వామీ, తమ ఆశీస్సులే సదా మాకు రక్ష. మీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగడం నా పూర్వపుణ్యసుకృతం.

విశ్వా : శుభమస్తు.

(లైట్సాఫ్)

* * *

# ఐదవ అంకము

## 'కోదండపాణి' (సూర్యవంశపు ధనుస్సు) - నాటకం

(ఉరుములు, మెరుపులు, పెనుగాలి-పరశురాముడు ప్రవేశం-మిథిలా నగరం)

పరశు : ఎవడు ఎవడీ రాముడు ఈ ధరాతలంపై మరో రాముడా ఎక్కడివాడు సర్వలోకాలకూ భార్గవరాముడొక్కడే మరో రాముడుండే వీలు లేదు. ఈ రాముడు, మానవుడా... దానవుడా లేక మాయావా? రామా రా నా ముందుకు నీ ప్రతాపం చూపు. లేదా శరణు వేడి రామశబ్దం విడనాడు.

(దశరథుడు ప్రవేశం)

దశ : భార్గవరామా శరణు-శరణు-నేను అయోధ్యాపతి దశరథుడను.

పరశ : ఊ! నీ కుమారుడేనా రాముడు..?

దశ : అవును స్వామీ తమరు అనుగ్రహించాలి, నా కుమారుడిని ఆశీర్వదించాలి శరణు వేడుతున్నా.

పరశ : శరణు-దశరథా నీవు కపటివి సుమా! లేకపోతే తెలిసి తెలిసి కుమారుడికి రామనామం పెడతావా..? పిలు నీ రాముడిని. అతడి శక్తి సామర్థ్యాలు పరీక్షిస్తా.

దశ : స్వామీ తమరు ఘటనా ఘటన సమర్థులు. ఇలా ఆసీనులు కండి నా కల్యాణ రాముడిని ఆశీర్వదించండి. రామా ఇలా రా తండ్రీ!

జన : జానకీ!

(రాముడు-సీత ప్రవేశము)

పరశు : ఇతడేనా నీ రాముడు. దశరథా కపట నాటకము ఇంకా కొనసాగిస్తున్నావా...?

పరశు : కపట నాటకమా..!?

పరశు : దశరథా, నీవు క్షత్రియుడవి కాదు–భీరుడవు. నా ప్రతిజ్ఞ పరాక్రమం, నియమం, తెల్సి, నే యుద్ధానికొచ్చిన ప్రతిసారి నుదుట కల్యాణ తిలకం కాళ్లకు పారాణి ప్రక్కన నవవధువుతో కనుపించి మరణం తప్పించుకున్నావు. ఇప్పుడు నీ కొడుకునీ అదేవిధంగా నా ముందుకు తెచ్చావు.

రామ : స్వామీ తమరాక, దర్శనం నాకు లభించిన వరం. మమ్మల్ని ఆశీర్వదించండి.

పర : అవన్నీ తర్వాత, త్రిపురాసుర సంహారంలో శివుడుపయోగించిన ధనుస్సు సంధించడం గొప్ప కాదు. అది చివికి శల్యమైంది. ఇది విష్ణు ధనుస్సు. అందుకుని సంధించు.

రామ : స్వామీ, కల్యాణ తిలకం కాళ్లకు పారాణి ఆరనే లేదు. అప్పుడే పరీక్షా. అదీ మీతో.

పర : అవశ్యం...ఇది నా ఆజ్ఞ.

దశ : భార్గవరామా! నీవు ఇరవై యొక్కసార్లు ఈ భూమండలంలోని మదాంధులైన రాజులను సంహరించిన మహాయోధుడివి. రుద్రుడి ప్రతి రూపానివి. నీ పరీక్షకు బాలుడు, నా రాముడు తూగడు, కనికరించు.

సీత : స్వామి. నేను మిథిలానగరాధీశుడైన జనకుని ఔరస పుత్రికను.

పర : రామా! విష్ణుధనుస్సు సంధించు, లేదా, రామనామం వీడు, తండ్రిలా వంకలు, శంకలతో తప్పించుకోజూడకు.

రామ : నేను ఏకపత్ని వ్రతుడను. ఆడినమాట తప్పను. ఎత్తిన విల్లుదించను. ఈ కోదండపాణి ప్రతిజ్ఞాబద్ధుడు.



(లక్ష్మణుడు వచ్చి నిల్చుంటాడు. అతని దగ్గర ధనుస్సు, బాణాలు ఉంటాయి)

పర : ఊ... ప్రతిజ్ఞలు వద్దు. నా ఆజ్ఞ పాటించు.

రామ : అవశ్యం.

దశ : రామా! భార్గవరాముడు మాన్యుడు పూజ్యనీయుడు క్షత్రియ వంశనాశకుడు.

జన : అంతేకాదు రామా! జమదగ్ని పుత్రుడు గుర్తుంచుకో.

రామ : ఎవరైనా భయం లేదు. భార్గవరామా! నా పితృ పితామహులు, వశిష్ఠ, విశ్వామిత్రుల ఆశీర్వచనంతో నా బలపరాక్రమాలు నిరూపించుకుంటా.

(భార్గవరాముడి చేతిలోని ధనుస్సు అందుకుంటాడు – బాణం సంధించుతాడు)

భార్గవరామా! బ్రాహ్మణుడవు. పరశువుతో సమస్త రాజలోకాన్ని జయించినవాడవు, సంధించిన ఈ బాణాన్ని ఏం చేయమంటావు. నీ పాదాలు ఖండించనా? నువ్వు జయించిన పుణ్య లోకాలను భస్మం చేయనా? నేనెక్కుపెట్టిన బాణం వృథా కాకూడదు.

పరశు : (తదేకంగా రాముడినే చూస్తూ...) దశరథరామా! నీలో దివ్య తేజస్సు చూస్తున్నా! నరుడి రూపంలో ఉన్న నారాయణుడిలా కనపడుతున్నావు. అస్తు–శుభమస్తు–ఇక ఈ జగతిలో నువ్వే రాముడివి.

రామా నేను సంపాయించిన భూమండలమంతా కశ్యప ప్రజాపతికి దానంగా ఇచ్చా. నీ బాణంతోనే సంపాయించిన పుణ్యమంతా లుప్తమైపోనీ నేను మహేంద్రగిరిపై సమాధి స్థితిలో ఉంటా.

(రాముడు బాణం వదలుతాడు వెలుతురు పెద్దగా శబ్దం, పరశురాముడు తలవంచుకుని వెడుతుండగా...)

రామ : భార్గవా! ఈమె జనక జానకి. మమ్మల్ని ఆశీర్వదించు.

(రాముడు, సీత నమస్కరిస్తారు)

పర : రామా! సర్వదా నీకు జయం–శుభం కలుగుగాక. ఈ ధరాతలంపై జీవరాశి ఉన్నంతకాలం, మీదాంపత్యం ఆదర్శంగా ఉంటుంది. సకల సన్మంగళానిభవంతు...

(పరశురాముడు వెడతాడు)

జన : రామా! నేను ధన్యుడని. పరశురాముడంతటి వాడిని జయించావ్. నీ వల్ల రఘువంశం, ఇక్ష్వాకువంశం పునీతమైనాయి. ఇక నుంచి నీవు శ్రీరాముడివి.

(మరొకసారి) ఇయం సీతా–మనుసుతా సహధర్మ చరతవః
ప్రతిచ్ఛచైనాం భద్రంతేపాణిం గ్రహ్ణ్లాష్యపాణినాం

(రాముడు, సీత నమస్కరిస్తారు)

దశ : జనకమహీపతీ! దశరథ రాముడిని, అయోధ్యరాముడుగా ఆశీర్వదించు.

జన : నీ అభీష్టం నెరవేరుగాక. శుభం.

(లైట్సాఫ్–లైట్సాన్) (కీర్తనాచార్యుడు–శిష్యుడు ప్రవేశం)

శిష్య : గురువు గారూ! రాముడు బాణం సంధించగానే, పరశురాముడు తన శక్తి, తేజస్సు, ఓజస్సు కోల్పోవడం విచిత్రంగా ఉంది.

కీర్త : పరశురామావతారం, అంశావతారం మాత్రమే. భూసంపదను తమ ఆధీనంలో ఉంచుకున్న మదాంధులైన రాజులను



సంహరించి, సమస్త జనావళికి ఆ సంపదపై అధికారం ఇచ్చాడు. అంతటితో ఆయన అవతార లక్ష్యం పూర్తయింది.

శిష్య : మరి ఆ తర్వాత శ్రీరాముడు.

కీర్త : భూసంపద అనుభవించేందుకు భూత, ప్రేత, పిశాచాది గణములు, రాక్షసులు ఆటంకాలు ఏర్పరచగా శ్రీరాముడు కోదండపాణిగా భారతావనిలో సంచరించి సమస్త ప్రాణికోటికీ, సుఖశాంతులు, స్వేచ్ఛ కల్పించి రామరాజ్యస్థాపనకు మార్గదర్శి అయ్యాడు.

(లైట్సాఫ్–లైట్సాన్)

(అయోధ్యలో దశరథుడి మందిరంలో దశరథుడు దిగులుగా ఎటో చూస్తూ ఉంటాడు. రంగస్థలంపై ఓ ప్రక్కగా వెలుతురు యజ్ఞదత్తుడు కుండతో నీళ్ల కోసం వెతుకుతూ ఉండగా ఓ వింత వ్యక్తి ప్రవేశం)

యజ్ఞ : స్వామీ తమరు?

వ్యక్తి : నేనందరివాడిని...ఎవ్వరికీ అందనివాడిని.

యజ్ఞ : ఇక్కడ నీటి చలమలున్నాయా? నా తల్లిదండ్రులు అంధులు. పైగా దప్పికతో ఉన్నారు. సంధ్య చీకట్లో, దారి తప్పాము. నీటి జాడ చెప్పి పుణ్యం కట్టుకోండి.

వ్యక్తి : అలా ముందుకెళ్లు, అక్కడ నీటి మడుగు ఉంది. (వ్యక్తి వెడతాడు)

(యజ్ఞదత్తుడు నీళ్ల కుండను ముంచుతుండగా బుడబుడమని శబ్దం, ఇంతలో బాణం వచ్చి తగులుతుంది.)

యజ్ఞ : అబ్బా.... ఎవడీకిరాతకుడు అమ్మా..అయ్యో...ఎవరదీ, నేను మునికుమారుడని.

(దశరథుడు ప్రవేశం)

దశ : స్వామీ, మీరు? నేను అయోధ్యాపతి దశరథుడను.

యజ్ఞ : మీరు నన్నెందుకు చంపాలనుకున్నారు?

దశ : నేను వేటకైవచ్చా, చీకట్లో జంతువనుకుని శబ్దవేది ప్రయోగించా...నన్ను మన్నించండి.

యజ్ఞ : మన్నించడమా? బాణంతో మృగాన్ని వేటాడినట్లు నన్ను వేటాడావు. నా తల్లిదండ్రులు ఎలా ఉన్నారో? వారి దాహం ఇప్పుడెవరు తీరుస్తారు? అబ్బా...

దశ : కుమారా! తెలియక బ్రహ్మహత్యా పాతకానికి ఒడిగట్టా.

యజ్ఞ : తెలిసి చేసినా, తెలియక చేసినా హత్య చేశావు. వెళ్లి నా తల్లిదండ్రులకు నా మరణవార్త వినిపించు.

దశ : నిన్ను వారి దగ్గరకు తీసుకెళ్తా.

యజ్ఞ : వద్దు, నే బ్రతకను, ఈ బాణం తీసివెయ్యి. ఈ బాధ భరించలేను. నా తల్లిదండ్రులను ఓదార్చు. వాళ్ల అంధులు ఇప్పుడు అనాథలు కూడా...

దశ : ఈ బాణం తీస్తే మరణం తప్పదేమో?

యజ్ఞ : తప్పు చేశావ్. రఘువంశీకుడా! మనిషికీ, మృగానికీ తేడా తెలియదా నీకు? నా తల్లిదండ్రుల ఆగ్రహానికి గురికాకు వెళ్లు. అబ్బా... నాకు ఈ నరకయాతన నుంచి విముక్తి కావాలి. తీసెయ్యి. ఈ బాణాన్ని.

(దశరథుడు అయిష్టంగానే బాణం తీస్తాడు, యజ్ఞదత్తుడు మరణించాడు.)

(ఇంతలో వ్యక్తి ముసలి దంపతులను తీసుకునివస్తాడు.)



దశ : వీరు? వీళ్లేనా ఈ మునికుమారుడి తల్లిదండ్రులు.

వ్యక్తి : అందుకేగా, తీసుకొచ్చా.

దశ : మీరు..?

వ్యక్తి : నేను అందరివాడిని, ఎవరికి అందనివాడిని (వెడతాడు)

తండ్రి : నాయనా దాహం.

దశ : స్వామీ! నేను దశరథుడను నీ కుమారుడిని మృగమని భావించి చంపిన పాపాత్ముడను.

తండ్రి : నా కొడుకు మరణించాడా! నిజమా....కుమారా! మమ్మల్ని దిక్కులేని వాళ్లను చేశావా? తండ్రీ మాకు శుశ్రూషలెవరు చేస్తారు. కందమూలాలు ఎవరిస్తారు. నాయనా, నీ తల్లి కబోది, ఈ వయస్సులో మాకు పుత్రశోకం మిగిల్చావా...తండ్రీ! మాకిక మరణమే శరణ్యం...

దశ : ఈ పాపాత్ముడిని శపించండి. బ్రహ్మ హత్యాపాతకం చేశా నాకు నిష్కృతి లేదు.

తండ్రి : దశరథా! నాకు గర్భశోకం మిగిల్చావు. నాలాగే నువ్వు కూడా పుత్రవియోగంతోనే మరణిస్తావు.

దశ : స్వామీ...

తండ్రి : నా శాపానికి తిరుగులేదు. నన్ను, నా సతినీ కుమారుడినీ చితిపేర్చి దహనం చెయ్యి. కనీసం ఈ ఉపకారమన్నా చెయ్యి. మాకు ఈ జీవితం నుంచి విముక్తి ప్రసాదించు.

(స్పాట్ ఆగిపోతుంది)

దశ : ఆనాటి శాప ఫలితం ఈనాడు ఇలా వెంటాడుతున్నది. కైకేయి, అలా దూరంగా నా కంటపడకుండా తిరగకు. రా-నీ కాళ్లు

పట్టుకుంటా నీ కోరికలు ఉపసంహరించుకో. నా శ్రీరాముడికి పట్టాభిషేకం చేద్దామని ఆశించా. కూడదన్నావు సరే భరతుడికే పట్టాభిషేకం చేస్తా. సరేనా. మరి శ్రీరాముడికి పద్నాలుగేళ్లు వనవాస దీక్ష ఎందుకు...? కైకా, కరుణించు శ్రీరాముడికి వనవాస దీక్ష ఉపసంహరించు. రఘు, సగర, అజ, హరిశ్చంద్ర, దిలీప, ఇక్ష్వాకు వంశ పితామహ, ప్రపితామహులారా! నాకు దారి చూపండి. మీ వంశంలో పుట్టిన నేను ఆడిన మాట తప్పి, అపకీర్తి పొందటం అవాంఛనీయం. కానీ ఎన్నో ఏళ్ల కలల పంట నా రాముడు, పద్నాలుగేళ్ల అరణ్యవాసం చెయ్యటం వాంఛనీయం కాదే? ఏదీ... కర్తవ్యం.

(క్షణం నిశ్శబ్దం – దశరథుడు లేచి అడుగు వెయ్యబోయి సాధ్యం కాక కూర్చుంటాడు)

వశిష్ఠ మహర్షీ! తమరు, ఈ రఘువంశ కులగురువులు. బ్రహ్మర్షులు. పట్టాభిషేక ముహూర్తం, వనవాసానికి ఎలా కారణమైంది? మూహూర్తలోపమా?

(అప్పటికి వశిష్ఠుడు వచ్చాడు)

ఎవరది...? నాకంతా శూన్యంగా కనపడుతోంది. కైకా? కౌసల్యా? ఎవరా వచ్చింది.

వశి : నేను వశిష్ఠుడను.

దశ : నా రాముడేమన్నాడు...? ఒక్కసారి రమ్మను నే శ్రీరాముడిని చూడాలి, మాట్లాడాలి. నాయనా! నీ పిన తల్లికిచ్చిన వరాలు ఆమె విధించిన ఆంక్షలు అంగీకరించకు. వనవాసానికి వెళ్లకు. నీ తండ్రి కైకేయి సౌందర్యానికి దాసుడై, అనాలోచితంగా ఇచ్చిన



ఆనాటి వరాలు కాలదోషం పట్టాయి. రాజ్యాధికారం, జ్యేష్ఠుడిగా నీదే! కాదనే అధికారం ఎవ్వరికీ లేదు. కదా వశిష్ఠ మహర్షీ?

వశి : దశరథ! వ్యామోహం వదలుకో, ఆడిన మాట తప్పడం రఘువంశానికి అరిష్టం.

దశ : ఏనాటి మాట...?

వశి : ఏనాటిదైనా, మాటిచ్చావ్. కైక వరాలు ఇప్పుడు అంగీకరించావు. శ్రీరాముడికి నీ మాటగా చెప్పమని కైకను కోరావు. ఇదంతా ఏమిటి...? అనృతం మహాపాపం. అపఖ్యాతి పాలుగాకు. ముహూర్తం ఏ విధంగా నిర్ణయించినా, పురుష ప్రయత్నం వేరు, విధి నిర్ణయం వేరు. కానున్నది కాక మానదు. శ్రీరాముడి వనవాసం, సద్యో ఫలితాలనే ఇస్తుంది. నిగ్రహించుకో...

దశ : నా మనస్సు అంగీకరించడం లేదు. శ్రీరాముడు లేని ఈ భువనం, నగరం, జీవితం నాకొద్దు. నేను జవం, జీవం, చైతన్యం కోల్పోతున్నా. నాకు మార్గాంతరం చూపు. శ్రీరామ వనవాసం ఆపు.

వశి : దశరథా! కష్టాలు కన్నీళ్లతో తీరవు. ఇదంతా స్వయం కృతాపరాధం. అనుభవించాల్సిందే. నే వెళ్లి శ్రీరాముడి వనవాస దీక్షకు, విధివిధానాలు వివరిస్తా. (వెడతాడు)

దశ : ఎన్నో ఏళ్లు కళ్లు కాయలు కాచేలా కుమారుల కోసం పరితపించా. అశ్వమేథ పుత్రకామేష్టియాగాలు చేశా. అన్నీ ఫలించి అదృష్టవంతుడనని ఆనందించా. శేషజీవితం శుభప్రదం, జయప్రదం, అవుతుందని ఆశించా. కానీ కైక కాకిలా నా అమృత భాండాన్ని నేలపాలు చేసింది. కైకా...

(వ్యక్తి వస్తాడు)

దశ : నువ్వు కైకవా...

వ్యక్తి : కాదు.

దశ : మంథరవా...

వ్యక్తి : వాళ్లు నాఛాయలు. వాళ్లకు ప్రేరణ నేనే.

దశ : నువ్వెవరు? ఈ ఆకారమేమిటి? నీలో కైక, మంథర కనపడుతున్నారు. నువ్వు?

వ్యక్తి : నేను అందరివాడిని... ఎవరికీ అందనివాడిని.

దశ : వెళ్లు. నీ రూపం నాకు జుగుప్స కలిగిస్తోంది. వెళ్లు వెళ్లూ కైకా నీవు నా భార్యవా...బడబాగ్నివా? మంథరా! నువ్వు కైకకు సేవకురాలివా? లేక మృత్యురూపంలో వచ్చిన శనిదేవతవా? ఏమో, అంతా అయోమయం, అంధకారం. కాముకుడినై కళ్ళు మూసుకుపోయినందుకు, నాకు తగిన శాస్తి జరిగింది. కైకా! నిన్ను కాంతిపుంజం అనుకున్నా. శ్రీరాముడిపై నీ ప్రేమ, వాత్సల్యం నిజమనుకున్నా. కానీ, కాలాగ్నివని గ్రహించేసరికి అయిపోయింది. సర్వనాశనం అయ్యింది. (వ్యక్తి, కైక, మంథర పెద్దగా నవ్వుతారు) ఎందుకు నవ్వుతారు? వెళ్లండి. అంతా వెళ్లండి. నన్ను సర్వనాశనం చేశారు. నా రాముణ్ణి నాక్కాకుండా చేశారు వెళ్లండీ (పెద్దగా అరిచాడు... అందరూ వెళ్లారు)

శ్రీరామా...

చిదిమిన పాల్గారు చెక్కుటద్దములపై
జిలిబిలి చిరునవ్వులొలయినవాడు

కాళ్ల గజ్జెలు ఘల్లు ఘల్లు మనంగ నందరికనుల్ చల్లగా

దిరుగువాడు బుడిబుడినుడువుల భూర్వభూపాలగా



ధల నేనడుగుచో బోబలుకువాడు

రాఘవా ముద్దీయరా యన్న నెగిరిగం

తిడచు హాయిగా కౌగిలించువాడు

నట్టి పదినాలుగేడుల బొట్టెనెట్టు

లసుర భీకర వనసీమకంపువాడ

ననుచు నేడ్చితి నెప్పుడోయపుడు మఱల

నిపుడు నీమూలమున లేడ్చుతుంటి

(శ్రీపానుగంటివారి, పాదుకా పట్టాభిషేకం నాటకం నుండి)

(క్షణం నిస్సహాయంగా - అచేతనంగా దశరథుడు కూర్చుంటాడు-శ్రీరాముడు నార బట్టలతో ప్రవేశం-వెంట వశిష్ఠుడు)

శ్రీరామ : తండ్రీ ! నీ ఆజ్ఞ శిరసావహించి-వనవాస దీక్ష స్వీకరించాను, అనుమతి ఇస్తే, వనవాసానికి వెడతాను.

(దశరథుడు అయోమయంగా చూస్తుంటాడు)

వశి : దశరథా! శ్రీరాముడు నీ అజ్ఞను కోరుతున్నాడు.

దశ : అందరూ వెళ్లండి. నాకెవ్వరూ లేరు. భార్యా, పుత్రులు, అంతా భ్రమ. దుఃఖమే శాశ్వతం. బంధాలు అనుబంధాలన్నీ అశాశ్వతం.

శ్రీరామ : గురుదేవా నా తండ్రి...

వశి : నీ వియోగాన్ని సహించలేకుండా ఉన్నాడు.

శ్రీరామ : కర్తవ్యం!

వశి : సూర్యాస్తమయంలోపు అయోధ్య వదలి వెళ్లాలి. అదేగదా కైక చెప్పింది.

శ్రీరామ : మరి శెలవా..? (సీత ప్రవేశం)

సీత : నన్నూ అనుగ్రహించండి.

శ్రీరామ : సీతా! నే వెడుతున్నది వనవిహారానికి కాదు, వనవాసానికి. అదీ, పద్నాలుగేళ్లు.

సీత : నేనూ మీ వెంటే. నా తండ్రి, వివాహసమయంలో, "ఇయం మమసుతా సీతా సహధర్మచారిణీ", అని గదా అన్నది. మీరెక్కడుంటే అదే నాకు అయోధ్య.

శ్రీరామ : సీతా! నదీనదాలు, ఘోరారణ్యాలు, క్రూరమృగాలు, వనవాసం దుఃఖ భాజనం.

సీత : స్వామీ! మీరూ అవిక్రమ పరాక్రమవంతులు. మీ వెంట ఉండటమే నా కర్తవ్యం, మీ సాహచర్యమే నాకు స్వర్గం.

శ్రీరామ : గురుదేవా!

వసి : శ్రీరామా! దాంపత్యం, కష్టం, సుఖం, వెలుగు, వెన్నెల అన్నీ కలబోసిన సుఖానుభవం. ఆమె నీవెంట ఉండటమే సర్వదా అభిలషణీయం.

సీత : స్వామీ! ఈ భోగాలు, మర్యాదలు, రాజభవనాల్లోని ఆంక్షలు, వీటికన్నా ప్రకృతి, అందులోని సౌందర్యం, ప్రజలు, వాళ్ల జీవన విధానం చూడాలి. పదండి.

శ్రీరామ : గురువాజ్ఞ! నీ మనోరథం. పదండి

(లక్ష్మణుడు ప్రవేశం)

లక్ష్మణుడు : సోదరా! నీ నీడను, బహిప్రాణాన్ని, నేనూ నీవెంటే.

శ్రీరామ : లక్ష్మణా, తండ్రి ఆజ్ఞ, తల్లి కోరిక, నే వనవాసానికి వెళ్లడం. నువ్వొస్తే. నా తల్లి కౌసల్య, నీ తల్లి సుమిత్రకు ఎవరు సేవ చేస్తారు...?



లక్ష్మణుడు : వనవాసంలో మీకెవరు రక్షణ?

శ్రీరామ : ఈ కోదండం!..

లక్ష్మణుడు : అన్నా! కలిసి పెరిగాం, విద్య, వివాహం అన్నిటా నీకు తోడున్న నన్నొదలి వెళ్లడం ధర్మమా?

శ్రీరామ : తల్లి సుమిత్ర అంగీకరించిందా?

లక్ష్మణుడు : ఆహా! పైగా ఏమందో తెలుసా, శ్రీరాముడు నీకు తండ్రి, సీత నీ తల్లి. వాళ్లున్నచోటే అయోధ్య. వాళ్లకు రక్షణగా ఉండు అన్నది.

శ్రీరామ : సరే...అంతా దైవేచ్ఛ.

(శ్రీరాముడు–లక్ష్మణుడు–సీత–దశరథుడికి నమస్కరిస్తారు)

వసి : శ్రీరామా! ఋష్యాశ్రమాలు, జనావాసాలు, మునులు, మహర్షులు ఎందరో నీ వనవాసంలో తటస్థపడతారు అందరినీ సేవించి ఆశీస్సులందుకో. వింధ్య పర్వతాలకవతల, దండకారణ్యం వస్తుంది. అక్కడ గోదావరీతీరం నీకు ఆవాసయోగ్యం. సదా అప్రమత్తంగా ఉండు.

శ్రీరామ : తమ ఆశీర్వాదబలంతో వనవాస దీక్ష ముగించుకువస్తాను (అందరూ నమస్కరిస్తుండగా)

వసి : శ్రీరామా! జయం శుభం

(లైట్సాఫ్)

* * *

## ఆరవ అంకము

### 'కోదండపాణి' (సూర్యవంశపు ధనుస్సు) – నాటకం

### కీర్తనాచార్యుడు – శిష్యుడు

శిష్యు : స్వామీ! శ్రీరాముడికి పట్టాభిషేకం అవ్వాలి కదా..! కానీ ఈ వనవాస దీక్ష ఎలా సంక్రమించింది ఏమిటి దీని ఆంతర్యం?

కీర్తనా : ప్రతి మనిషికీ మూడు కర్మలు తప్పవు అవి ప్రారబ్ధం–సంచితం–ఆగామి.

శిష్యు : దశరథుడు ప్రారబ్ధకర్మలకు బలి ఐనాడన్నమాట.

కీర్తనా : కైక సంచిత కర్మవల్ల భర్తను కోల్పోయింది. ఆశించిన భరతుడి పట్టాభిషేకం జరుగలేదు. పైగా నిందలు మోసింది.

శిష్యు : మరి శ్రీరాముడో

కీర్తనా : రాముడు ఆగామి కర్మలకు ఎదురునిలిచాడు. అవి అనుభవించాడు. ఎలాగో, చిత్ర కూటంలో ఉన్న శ్రీరాముడు వల్ల తెలుసుకుందాం.

(లైట్సాప్)

(చిత్రకూటంలో సీత పూలమాల తయారు చేస్తుంది. వెన్నెలలో శ్రీరాముడు ప్రవేశం)

శ్రీరామ : జానకీ...ఈ ముగ్గులు అలంకారాలు, నీ కట్టూ, బొట్టు అన్నీ శోభాయమానంగా ఉన్నాయి.

సీత : ఆశ్రమాలలో–మునికాంతలను చూసి నేర్చుకున్నాను.

శ్రీరామ : ఇక్కడ ఈ ఒంటరితనం...

సీత : అన్నీ ఆనందమయం. కోటలో ఏముంది. ఇక్కడ ఎన్ని వింతలో..ఎన్నో చెట్లు, పూలు, కాయలు, పక్షులు, మునులు, మునిపత్నులు. ఇదే కదా వసుధైక కుటుంబం.



శ్రీరామ : సీతా...ఆ చంద్రబింబం నీ నుదుట ఉంటే నీకు మరింత అందం.

సీత : సూర్యవంశస్థులు కదా!... మీకీ చంద్రబింబం మీద మమకారం దేనికీ?

శ్రీరామ : ఆ చంద్రబింబం నీ నుదుట ఉంటే నేను రామచంద్రుడి నవుతానుగా...

సీతా : మీ అభీష్టం...కానివ్వండి...

(సీత నుదుట చంద్రబింబం బొట్టుపెట్టి)

శ్రీరామ : సీతా! ఇదిగో ఫలం (సీత ఫలాన్ని స్వీకరించి)

సీత : ఇది ఏమి ఫలం. దీనికి పేరు లేదా

శ్రీరామ : సీతాఫలం (సీత నవ్వింది)

సీత : ఆహా! మంచి పేరే ఇదిగో మీకోపండు.

శ్రీరామ : ప్రతిఫలమా?

సీతా : కావచ్చు.

(ఇద్దరూ నవ్వుకుంటారు)

స్వామీ నాదో సందేహం. అడుగనా...?

శ్రీరామ : ఏకాంతంలో సందేహం. అడుగు.

సీత : మీ అయోధ్యలో పాయసం తింటే పిల్లలు పుడతారట నిజమా....?

శ్రీరామ : నీవు విన్నది నిజమే... మిథిలానగరంలో భూమిని దున్నితే బంగారు బొమ్మ దొరుకుతుందని విన్నాను.

(సీత నవ్వింది)

ఇలా కష్టం-సుఖం, రేయి పగలుగా ఈ వనవాసం గడిస్తే

(ఇంతలో లక్ష్మణుడు వెంట జాబాలి ప్రవేశం)

లక్ష్మణుడు : సోదరా! ఈ మహర్షి మీ కోసం వచ్చారు. పేరు చెప్పలేదు సరిగదా, చిర్రుబుర్రుమని ఆగ్రహం. అసహనం.

(శ్రీరాముడు సీత నమస్కరిస్తారు)

జాబాలి : సరిసరి. ఈ మర్యాదల కేం లే? అసలు ఈ వనవాసానికి కెందుకొచ్చారు?

శ్రీరామ : మా తండ్రి ఆజ్ఞ. ఇంతకూ తమరు?

జాబాలి : నేను జాబాలిని... తండ్రి ఆజ్ఞ నువ్వు పాటించావు, త్యాగధనుడివి, రాజ్యం వదిలావు ప్రజల పాలన నుంచి తప్పించుకున్నావు, పిరికిపందా...అవునా, వనవాసం చెయ్యమని నీ తండ్రి చెప్పాడా?

శ్రీరామ : నా తల్లి చెప్పింది.

జాబాలి : తల్లి!? ఏ తల్లి? కన్నతల్లా? పెంచిన తల్లా?

శ్రీరామ : మహర్షీ ప్రతిమనిషికి కన్నతల్లి - గురుపత్ని, అగ్రజుడి భార్య, భూమిని పాలించే రాజు గారి భార్య, భార్యను కన్నతల్లి అందరూ మాతృమూర్తులే గదా...

జాబాలి : కైక భరతుడి తల్లి. పైగా స్వార్థంతో చెప్పింది.

శ్రీరామ : స్వామీ! కైక నన్ను పెంచినతల్లి. అయోధ్యాపతికి భార్య. ఆమె నాకు మాతృ సమానురాలు. ఆమె మాట నాకు శిరోధార్యం. పైగా నా తండ్రి, ఇచ్చిన మాట తప్పాడన్న అపప్రద పొందడం మా వంశానికి కళంకం కదా...



జాబాలి : శ్రీరామా! ఇక్ష్వాకువంశంలో జ్యేష్ఠుడిదే రాజ్యాధికారం. దాన్ని కాదనే హక్కు ఏ వ్యక్తికీ, ఆఖరికి కన్నతల్లిదండ్రులకూ లేదు. వనవాసానికి వచ్చావు. ఇది కూడని పని. వెళ్లు, ఇది నా ఆజ్ఞ.

శ్రీరామ : స్వామీ! నన్ను మన్నించండి.

జాబాలి : శ్రీరామా! కపట నాటకం మానుకో నువ్వేదో తండ్రి మాట జవదాటనివాడవని, కీర్తి కోసం తాపత్రయపడకు. తల్లీ, తండ్రీ, గురువు ముగ్గురు గురువులే. నే ఆచార్యుడిగా ఆజ్ఞాపిస్తున్నా. జీవితం క్షణికం. బంధాలు, అనుబంధాలు అశాశ్వతం. నీలాంటి సజ్జనుడు అయోధ్యను ఏలాలి. అంతేగాని సత్యం, ధర్మం అని కర్తవ్యాన్ని విస్మరించకూడదు.

శ్రీరామ : స్వామీ! నన్ను మోహితుడిని చేస్తున్నారు. భూమి, కీర్తి, యశస్సు, అధికారం మనిషిని ప్రలోభపెడతాయి. అవి నాకొద్దు. ఇది వేద భూమి. శుభకర్మలు చేయడం, సత్యం, ధర్మము, పరాక్రమము, భూతదయ, అతిథి పూజ, ప్రియసంభాషణం. ఇవే నేను ఆచరించే సత్యధర్మాలు. నన్ను ఆశీర్వదించండి.

జాబాలి : అంతేనా...గురువాజ్ఞ ధిక్కరిస్తున్నావు అందుకు ఫలితం తెలుసా...?

శ్రీరామ : స్వామీ! తమరి ఆగ్రహం నేను అనుగ్రహంగానే భావిస్తాను. (నమస్కరిస్తాడు)

జాబాలి : (శ్రీరాముడిని ప్రేమగా కౌగలించుకుని) శ్రీరామా! నీ నియమం, నిగ్రహం, పరాక్రమం తెలిసి వచ్చాను. నా వాదన నీముందు ఓడిపోయింది. నా పరీక్షలో నెగ్గావు.

"రామో విగ్రహవాన్ ధర్మః" అన్న సత్య వాక్కుకు ఆదర్శంగా నిలిచావ్. శుభమస్తు. దండకారణ్యంలో మహర్షులేగాదు. మాయావులు, కామరూపులు ఉన్నారు. జాగ్రత్త.

(సీత–రామ–లక్ష్మణులు నమస్కరిస్తుండగా లైట్సాఫ్)

(రామబాణ రామాయణం (2వది)

(కీర్తనాచార్యుడు–శిష్యుడు–లైట్సాన్)

శిష్యుడు : అన్యాయం.. ఘోరం “వనిత తనంత తా వలచి వచ్చిన చుల్కనగాదే ఏరీతికిన్”

కీర్తనా : ఏమైంది నాయనా...

శిష్యుడు : ధర్మానికి ప్రతిరూపమైన శ్రీరాముడి సమక్షంలో శూర్పణఖ, ముక్కు చెవులు కోయడం ధర్మం కాదుగదా! ఏ యుగమైనా, స్త్రీకిలా అన్యాయం జరగడం అమానుషం.

కీర్తనా : శూర్పణఖ జీవితం తెలుసా? ఆమె రావణ బ్రహ్మ చెల్లెలు. పెళ్లయింది. కానీ, రావణాసురుడే ఆమె భర్తను చంపాడు.

శిష్య : చెల్లెలుకు వైధవ్యమా!?

కీర్తనా : రావణుడు కాలకేయుడితో యుద్ధం చేస్తూ పొరపాటున శత్రువనుకుని శూర్పణఖ భర్తను చంపాడు.

శిష్య : ఆ తర్వాత!

కీర్తన : తప్పు తెలుసుకుని దండకారణ్యానికి వెళ్లి సకల సుఖాలు అనుభవించమని శూర్పణఖకు చెప్పాడు. శూర్పణఖ కొడుకు జంబుకాసురుడిని పొదల మాటున ఉండగా లక్ష్మణుడు సంహరించాడు.

శిష్య : అన్న భర్తను చంపాడు, కొడుకుని లక్ష్మణుడు చంపాడు, మరి ఆమె బ్రతుకు.

కీర్త : ఇంత జరిగినా శూర్పణఖకు కామవాంఛ తీరలేదు. రామ–లక్ష్మణులను చూసి మోహించి పెళ్లాడమని బలవంతం చేసింది.



అంతేగాదు తన కామవాంఛకు సీత అడ్డమని భావించి ఆమెను చంపాలని యత్నించింది.

శిష్య : అందుకు ఆమె ముక్కుచెవులు కోయడం ధర్మమా?

కీర్తనా : శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. లక్ష్మణుడు అంతే. పైగా శూర్పణఖ కామవాంఛతో బరితెగించింది. కామానికి ముక్కు, కళ్లు, చెవులు, నోరు, శరీరం, ప్రేరకాలు కనుక వాటిని సంహరించి వికార స్వరూపిణిగా చేయడం ధర్మం కదా! భిన్నజాతులవారైన నరులు, రాక్షసుల సంయోగం ప్రకృతి విరుద్ధం కదా! ఆ పనిని రఘువంశీయులు చేయరు.

శిష్య : అంటే కామం అనర్థాలకు కారణమంటారు.

కీర్త : సంచిత కర్మ అంటే ఇదే. శూర్పణఖ ప్రతీకార వాంఛతో రావణుడిని ప్రేరేపించి, సీతాపహరణం చేయించింది. ఫలితం–ఆగామి కర్మలకు శ్రీరాముడు దాసోహమన్నాడు.

శిష్య : మంధర శ్రీరామ వనవాసానికి, శూర్పణఖ సీతాపహరణానికి కారణమయ్యారన్నమాట.

కీర్త : అంతే నాయనా! మంధరకు కీర్తికాంక్ష, శూర్పణఖకు కామవాంఛ. మనస్సు చంచలమైతే జరిగే పరిణామాలు ఇలాగే ఉంటాయి.

(లైట్సాఫ్)

(శ్రీరాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడు, సుగ్రీవుడు ఋష్యమూక పర్వతంపైన ఉంటారు)

(మరోచోట వాలి–తార–మధుపానం చేస్తూ శృంగార క్రీడలో ఉంటారు)

ఆంజ : శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం
ఆజానుభాహుమరవిందదళాయ తాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి

స్వామీ, మా స్వామి సుగ్రీవులు పరాభవంతో ఉన్నారు. తమరు తల్చుకుంటే మా స్వామి దుఃఖం తీర్చలేరా...

శ్రీరామ : అవశ్యం. సుగ్రీవా. నా మీద నమ్మకముంచు నీ మైత్రి సదా అభిలషణీయం.

సుగ్రీ : వాలిపై నా ప్రతీకారం తీరే మార్గం చెప్పండి. మీ మీద నమ్మకంతో వాలితో ద్వంద యుద్ధానికి వెళ్లి మరోసారి పరాభవింపబడ్డా.

శ్రీరామ : ఏం చేస్తే నీకు నమ్మకం కలుగుతుంది?

సుగ్రీ : కోదండపాణీ! ఆ కనబడే సాల వృక్షాలను ఒకే ఒక్క బాణంతో కూలగొట్టగలరా?

(శ్రీరాముడు బాణం సంధించి వదిలాడు...తెరపై బాణం వెడుతుంది
ఒక్కసారిగా వృక్షాలు నేలకొరుగుతాయి)

కోదండపాణీ! నీ అస్త్ర విద్యా విన్యాసం అద్భుతం. ఇంత ప్రజ్ఞాశాలివి, నేను వాలితో ద్వంద యుద్ధం చేస్తుంటే బాణ ప్రయోగం ఎందుకు చెయ్యలేదు?

శ్రీరామ : సుగ్రీవా, మీరిద్దరూ ఒకే పోలిక, తొందర పడి బాణ ప్రయోగం చేస్తే అది నీకు హాని కలిగిస్తే?

సుగ్రీ : మరి మార్గాంతరం...?

లక్ష్మణుడు : మిత్రమా! నిన్ను గుర్తించేందుకు వీలుగా ఒక మాల ధరించి యుద్ధానికి వెళ్లు.



శ్రీరామ : సలక్షణమైన ఆలోచన. సుగ్రీవా మీ అన్న వాలిని ద్వంద యుద్ధానికి ఆహ్వానించు.

సుగ్రీ : ఆడిన మాట తప్పరుగా, నేనీసారి ఓడితే నాకు మరణమే శరణ్యం.

శ్రీరామ : ఈ కోదండంపై ఆన. విజయోస్తు...

(అందరూ వెడతారు...వెలుగులో వాలి–తార)

తార : స్వామీ! సుగ్రీవుడు అయోధ్యాపతి కుమారులతో స్నేహం చేసి మీపై ప్రతీకారం తీర్చుకోవాలని యోచిస్తున్నాడు.

వాలి : అవును తారా, అంగదుడు చెప్పగా నేనూ విన్నా. తారా సుగ్రీవుడో పిరికిపంద, ఎందరి స్నేహం పొందినా నన్ను గెలవలేడు.

తార : స్వామీ పంతాలు, పట్టింపులు, ఆవేశకావేశాలు వద్దు. సుగ్రీవుడు నీ తమ్ముడు. అన్నదమ్ముల మధ్య కలహం కార్చిచ్చులాంటిది. మీ క్షేమానికే చేటు, ఆలోచించండి. సుగ్రీవుడిని సాదరంగా ఆహ్వానించి యువరాజుగా ప్రతిష్ఠించు. ఇది ఉభయులకు శ్రేయస్కరం. ఈ వన సీమకు శుభప్రదం.

వాలి : తారా! ధర్మాధర్మ విచక్షణకు ఇది సమయం కాదు. సుగ్రీవుడు సోదరుడే కానీ కుత్సితుడు. నన్ను చంపి నా రాజ్యాన్ని అపహరించాలని ఆశించాడు. వాడు పాముతో సమానం, ఆదమరిస్తే కాటు వేస్తాడు.

తార : స్వామీ! సోదరులు విడిపోతే కలహించుకుంటే వంశనాశనమేగా ఆ రామ–లక్ష్మణులను చూడండి. ఒకరివెంట ఒకరు పూవు పరిమళంలా కలిసి వున్నారు.

వాలి : తారా! నీవెందుకో భయపడుతున్నావు. రాముడికీ నాకు వైరం లేదు. అతడు నాకెందుకు అపకారం చేస్తాడు?

తార : సుగ్రీవుడితో మైత్రి ఉందిగా. అది చాలదా మిమ్మల్ని ఓడించటానికి. స్వామీ సుగ్రీవుడిని క్షమించలేరా...

వాలి : తారా! నా శక్తి సామర్థ్యాల మీద నీకు అపనమ్మకం కలిగిందా. నువ్వు వీరపత్నివి, నీకు భయమెందుకు...?

తార : భయం కాదు స్వామీ, ఈ వానర కులం పుష్టిగా, సమష్టిగా ఉండాలని నా ఆకాంక్ష. నీ అభీష్టం తీరుగాక.

(సుగ్రీవుడు - నేపథ్యం నుంచి)

సుగ్రీ : రాసోదరా! రా నాతో యుద్ధం చెయ్యి. నువ్వో, నేనో ఒక్కరే ఈ కిష్కింధలో ఉండాలి రా...

తార : విన్నారా, ఇంత రాత్రివేళ సుగ్రీవుడు మళ్లీ యుద్ధానికి రమ్మని ఆహ్వానిస్తున్నాడు.

వాలి : వాడికి ఈ రాత్రి కాళరాత్రే.

తార : సుగ్రీవుడు ఏదో పన్నాగంతో వచ్చాడు. ఇంతకు ముందే మీతో చావుదెబ్బలు తిన్నవాడు మళ్లీ వచ్చాడంటే?

వాలి : తారా! వీరుడిని. ద్వంద యుద్ధానికి పిలిస్తే వెళ్లకపోవడం భీరుడి లక్షణం.

తార : తెల్లవారనీయండి.

వాలి : నా తమ్ముడి బలం, బలగం నాకు తెలియదా? ఈ సారి వాడి అంతుచూస్తాను.



తార : చంపకండి, తగిన శాస్తి చేయండి. ఈ దండ ధరించండి శుభం కలుగుతుంది.

వాలి : తారా ఈ నలిగిన పూలదండ నాకు విజయం కలిగిస్తుందా? శకునాలు నమ్మకు, స్వశక్తిని మించిన సాధనం, ఆయుధం మరేదీ లేదు.

తార : సరే ఒక్కక్షణం....(తార వాలికి ప్రదక్షణం చేసి) మీ రాకకోసం ఎదరుచూస్తుంటాను (వెడుతుంది)

(వాలి పూలదండ విసిరేసి వెడతాడు)

(వాలి-సుగ్రీవుల-యుద్ధం ఓ ప్రక్క తార, మరో ప్రక్క లక్ష్మణుడు, ఆంజనేయుడు చూస్తుండగా క్షణంలో రామబాణం వచ్చి వాలికి తగిలి పడిపోతాడు)

వాలి : (తూలిపడబోతూ) రామా! క్షత్రియుడివి చెట్టు చాటు నుంచి బాణం వేశావు. నీలాంటి వీరుడికిది ధర్మమా?

(రాముడు, లక్ష్మణుడు, అంజనేయుడు ప్రవేశం)

శ్రీరామ : నువ్వు నరుడివా! కాదుగదా? వానరుడివి. నరులు ఆచరించే ధర్మాలు నీకు వర్తిస్తాయా? నేను క్షత్రియుడిని కదా! వేటలో జంతువుని ఎప్పుడు, ఎక్కడ, ఎలా కొట్టాలో నాకు తెలుసు.

వాలి : (లేవబోతు... లేవలేక) నీకు నాకు శత్రుత్వం లేదు కదా?

శ్రీరామ : మిత్రత్వం ఉందా? లేదే. పైగా సుగ్రీవుడు నన్ను శరణుజొచ్చాడు. అతడు నాకు మిత్రుడు. అతడి శత్రువు నాకూ శత్రువే, ఇది మిత్రధర్మం.

వాలి : రామా, నీ భార్యను అపహరించినవాడి జాడకోసం, సుగ్రీవుడితో స్నేహం చేశావు. నాకో మాట చెబితే, నీ సీతను వెదకి తెచ్చి ఇచ్చే వాడినిగదా ఇంత చిన్న పనికి నాతో విరోధం దేనికి..?

శ్రీరామ : నువ్వంతటి వీరుడవే, నా భార్యను రక్షించే బాధ్యత నాది. సీతాన్వేషణకు నాకు సాయం కావాలి. ఆ సహాయం సత్యధర్మాలు పాటించేవారే చెయ్యాలి. నా స్వప్రయోజనం కోసం అధర్మపరుల సాయం స్వీకరించను.

వాలి : నేనధర్మపరుడినా... నిందమోపి నీ అకృత్యాన్ని సమర్థించుకోకు.

శ్రీరామ : నీవు ధర్మాన్ని అతిక్రమించావు. తమ్ముడు, కన్న కొడుకు, శిష్యుడు ఈ ముగ్గురు పుత్ర సమానులు నువ్వేం చేశావు? ధర్మం తప్పి సుగ్రీవుడి భార్య రుమను బంధించి, బలాత్కరించి కామవాంఛ తీర్చుకున్నావు. ఇది ధర్మమా?

వాలి : మా వానరజాతిలో వావి-వరుసలు లేవు. అయినా నేను తప్పు చేస్తే నువ్వెవ్వరివి శిక్షించటానికి?

శ్రీరామ : ఈ భరతవంశాన్ని పాలించేది భరతుడు. అతడి రాజ్యంలో అన్యాయాన్ని నియంత్రించడం అతడి ప్రతినిధిగా నా విధి. వాలీ! నీవు స్త్రీ లోలుడివి. నీ రూపమే కాదు, మనస్సూ మర్కటమే. నీ చపలత్వం, కామవాంఛ అన్నీ నీ మరణానికి కారణాలే. బలవంతుడిననే గర్వంతో, సుగ్రీవ, ఆంజనేయ, జాంబవంతాది ధర్మపరులను దూరం చేసుకున్నావు. ధర్మ బాహ్యుడవైన నీకు ఈ మరణం అనివార్యం.

వాలి : రామా, నీతో వాదించలేను. నాకు మరణం తప్పదు. కాని ఒక్క కోరిక.

(ఇంతలో తార ఏడుస్తు వస్తుంది)

తార : స్వామీ, నే అనుకున్నంతా అయ్యింది. రామా, క్షత్రియుడివే? కందమూలాలు తినే వానరులం, మమ్మల్ని ఇలా వేటాడం నీకు ధర్మమా?



వాలి : తారా, అంతా గతజలసేతు బంధనం. నా ప్రారబ్ధకర్మలు, చంచలమైన మనస్సు, మరణం వైపు తీసుకెదుతున్నాయి. ప్రాణికి జననం, మరణం అన్నీ ఎప్పుడో నిర్ణయించబడ్డాయి. విచారించకు, కోదండపాణి చేతిలో చావు రావడం సుకృతమే.

తార : మీ లాంటి వీరులకు ఇలాంటి మరణమా?

వాలి : రామా, ఓ సహాయం చేయి...అంగదుడు...

శ్రీరామ : ఈ కిష్కింధకు యువరాజుగా చేస్తాను.

వాలి : మరి తార...

శ్రీరామ : ఆమెను సుగ్రీవుడు ఆదరిస్తాడు. ఆమె అభీష్టంమేరకు రాజ్యపాలన చేస్తాడు.

వాలి : (రాముడి పాదాలమీద వాలి) ధన్యుడిని, నీ పాదాల చెంత మరణం మహాయోగం.

(నమస్కరిస్తూ చనిపోతాడు)

తార : రామా, సీతకోసం నాకు భర్త వియోగం కలిగించావు. నీకు సీతతో సంయోగం కలుగుతుంది. కాని ఆమెతో కలకాలం ఉండవు. మళ్లీ నీకు వియోగం తప్పదు. ఇది నా అభిశాపం.

(లైట్సాఫ్)

(వాల్మీకి ఆశ్రమం-భరద్వాజుడు)

భరద్వా : స్వామీ! యాగంతో శ్రీరామ జననం, యోగంతో అహల్యా శాప విమోచనం, సీతాకల్యాణం, మీ కావ్యదర్శనం కానీ ఈ వియోగం ఎంత కాలం?

వాల్మీకి : భరద్వాజా, నా అన్వేషణ ఇంకా అసంపూర్ణం.

భర : ఎంత కాలం స్వామీ?

వాల్మీ : క్రౌంచపక్షి ఒకటి చనిపోతూ రోదిస్తుంటే దాని జతపక్షి చేసిన విరహాక్రందన నన్ను కవిని చేసింది కదా! ఆ విషాదాన్ని మరచి పోవాలనే తపనలో, కావ్యం ఆవిర్భవించింది. నా కావ్యంలోని శబ్దాలలో, విరహమే ధ్వనించింది ఇంత కాలం. తల్లిదండ్రులను కోల్పోయిన యజ్ఞదత్తుడు, పుత్రశోకంతో మరణించిన దశరథుడు, భర్తను కోల్పోయిన తార, సీతను పోగొట్టుకున్న రాముడు. ఒక వియోగ కావ్యంలాగా సాగింది. ఇక నా కావ్యంలో సంయోగమే ప్రధానాంశం.

(అప్పటికే నిషాదుడొచ్చాడు)

నిషా : స్వామీ! నేను జంట పక్షులను విడదీసిన పాపాత్ముడిని. నాకు ఉపకారం చేయండి.

వాల్మీ : ఎవరూ? నిషాదుడా? ఏం జరిగింది నాయనా...?

నిషా : ఎక్కడికెళ్లినా బ్రతికున్న ఆ ఆడపక్షి నావెంటే ఉండి అరుస్తూనే ఉంది. దాని ఏడుపుతో నాకు నిద్రాహారాలు లేవు. దాని ఆక్రందన భరించలేకుండా ఉన్నాను.

వాల్మీ : అంత బాధ కలిగిస్తున్న ఆ పక్షిని చంపేయలేకపోయావా?

నిషా : స్వామీ! నా వల్ల కాదు స్వామీ. ఇప్పటికే ఓ పక్షిని చంపి పాపం చేశాను. మళ్లీ ఆ పాపం చేయలేను.

వాల్మీ : నిషాదుడా, నీవు పుణ్యం చేసుకున్నావు. నాలో జ్యోతిని వెలిగించావు. నీవు నిషాదుడవు కావు. ఈ మహాకావ్యానికి నాంది పలికిన ఆదిత్యుడివి.

నిషా : స్వామీ నేను మనిషిని. నే బతకాలి, నాకు శాంతి కావాలి. (నమస్కరిస్తాడు పాదాల మీదపడి.) మార్గాన్ని చూపండి.



వాల్మీ : నిషాదుడా, రామచిలుకలను, ఎగిరే సీతాకోక చిలుకలను చూడు. అవి స్వేచ్ఛగా హాయిగా ఎలా ఉన్నాయో! మనమూ అంతే. అన్నిటిని ప్రేమించాలి. ప్రేమను పంచాలి. అదే జీవితం. అదే శాంతికి మార్గం.

నిషా : స్వామీ! నా కళ్లు తెరిపించారు. చెట్టు, పుట్ట, క్రిములు, కీటకాలు, అన్ని ప్రాణులనూ ప్రేమిస్తాను. వాటితో సహజీవనం సాగిస్తాను వస్తాను స్వామీ.

భర : ఆచార్యా, మీ కావ్యం?

వాల్మీ : ఒక ప్రేమ కావ్యం, అమృత సాగరం. శోధించిన కొద్దీ జీవితంలోని అన్ని కోణాలకు వర్తించిన శాశ్వత సత్యాలు కలిగిన రామాయణం. వేదవిహితం... అదే నా కావ్య లక్షణం.

(లైట్సాఫ్)

* * *

## ఏడవ అంకము

### 'కోదండపాణి' (సూర్య వంశపు ధనుస్సు) – నాటకం

### కీర్తనాచార్యుడు – శిష్యుడు

శిష్యుడు : మనోజవం మారుతతుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానర యూధముఖ్యం
శ్రీరామదూతం శిరసానమామి ॥

కీర్త : నాయనా శ్రీరాముడి దూతగా సీతాన్వేషణకు వెళ్లిన హనుమంతుడు కార్యసాధకుడై తిరిగి వస్తాడు.

శివప్రదం సుఖప్రదం భవచ్ఛిదం భ్రమాపహమ్ ।
విరాజమానదైశికం బజేహ రామ మద్వయం ॥

పాట : కోలాటం – ప్రారంభం
రామారామా శ్రీరామా రఘురామా
కోదండముపూని ఇలలో వెలసిన రామా
జయము జయము రామా శ్రీరామా
అవనీజగురుతులు–హనమతోపంపి
ఆనవాలిచ్చిన శ్రీరామా రామా
అంజనీ సుతుడు వారధిదాటెను
లంకలో సీతకు ఆనవాలిచ్చే
అమ్మ రాముని భంటునని చెప్పి
రామ రామ శ్రీరామ రఘురామ
ఆంజనీసుతుడు లంకను కాల్చి
చూడామణి తెచ్చి రామునికిచ్చి
జయము జయము రామా శ్రీరామా

(శ్రీరాముడు–లక్ష్మణుడు–సుగ్రీవుడు గాలి దుమారం–మెరుపులు)



సుగ్రీ : శ్రీరామా లేవయ్యా మారుతాత్మజుడు శుభవర్తమానంతో వస్తున్నాడు.

(హనుమంతుడి ప్రవేశం)

హను : కంటిన్ జానకి బూర్ణచంద్రవదనన్ గల్యాణి నా లంకలో
గంటిన్ మీపదపంక జాతము మదిన్
గౌతూహలం బొప్పగా
గంటిన్ మీ కరుణావలోకము విఖ్యాతంబుగా, గీర్తులన్
గంటిన్ మా కపివీర బృందమ్ములతో
గాంభీర్య వారాన్నిధి

(చూడామణి–శ్రీరాముడికిచ్చి నమస్కరిస్తాడు)

శ్రీరామ : హనుమా, జానికితో ఏం చెప్పావయ్యా?

హను : నేను శ్రీరామ దూతనని చెప్పాను. ఆ తల్లి తొలుత నమ్మలేదు. మాయావినో రావణ దూతనో అని శంకించింది. తల్లీ శ్రీరాముడు నీ పతిదేవుడు నా దేవుడని చెప్పాను.

నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు ధనశాబ్ద నేత్రముల వాడు
కంచు సన్నిభమైన కంఠంబుగలవాడు
చక్కని పీన వక్షంబువాడు తిన్ననైన కనుపట్టు దీర్ఘ బాహువులవాడు
ఘనమైన దుందుభి స్వనమువాడు
పద్మరేఖలు గల్గి పదయుగంబులవాడు
బాగైన యట్టి గుల్భములవాడు
కపటమెరుగని సత్యవాక్యములవాడు
రమణి రాముండు శుభలక్షణములవాడు
ఇన్ని గుణముల రూపింప నెగడువాడు
వరుససౌమిత్రి బంగారు వన్నెవాడు.

శ్రీరామ : (హనుమని కౌగిలించుకుని) హనుమా, ఈ చూడమణిని చూస్తే సీతను చూసినట్టే ఉంది. తండ్రి దశరథుడు మిథిలాధిపతి జనకుడు గుర్తొస్తున్నారు.

హను : శ్రీరామా, నీ కోసం నీ రాక కోసం ఎదురు చూస్తూ జీర్ణవస్త్రాలతో ఉంది. 'రామా...రా రామా' అంటూ శోకిస్తున్నదయ్యా.

శ్రీరామ : సుగ్రీవా! ఇంకా ఆలస్యం చేయకుండా లంకపై దండెత్తుదాం. సైన్యాన్ని సిద్ధం చెయ్యి.

సుగ్రీ : చిత్తం స్వామీ, అంగద, జాంబవంత, మహావీరులారా యుద్ధానికి సన్నద్ధులు కండి.

శ్రీరామ : సుగ్రీవా, ఇవ్వాళ ఉత్తరఫల్గుణీ నక్షత్రం, ఇవ్వాళే మన ప్రయాణం.

సుగ్రీ : చిత్తం సిద్ధం...

(రథం మీద కూర్చున్నట్లు అందరూ సిద్ధం యుద్ధభేరితో– శంఖారావం– లైట్సాఫ్)

(రావణుడి మందిరం, వందిమాగధులు స్తోత్రం చేస్తుంటారు. మండోదరి హారతితో ఉంటుంది. స్తోత్రం అయిపోతుండగా రావణుడు ప్రవేశం... అక్కడక్కడా వంటిమీద దెబ్బలు)

మండో : స్వామీ! స్వాగతం! యుద్ధవిశేషాలేమిటి..?

రావ : దేవీ! ఆ నరుడు రాముడు, 'లంకాధిపతీ యుద్ధంలో అలసిపోయావు, పైగా–సూర్యాస్తమయమైంది. రేపురా' అన్నాడు.

మండో : అంతా విచిత్రంగా ఉందే. బ్రహ్మవంశస్థులు, ఈశ్వరభక్తులు, త్రిలోకాలనూ జయించి లంకానగర వైభవాన్ని దశదిశలా వ్యాపింపచేసిన మహాయోధులే, మిమ్మల్ని ఒక నరుడు శాసించడం నమ్మశక్యంగావడంలేదు.



రావ : దేవీ, అతడు నరుడా? కాదేమో... నరుడైతే వానరుల సాయంతో సముద్రానికి సేతువు కట్టడం లంకానగరాన్ని ముట్టడించడం ఎలా సాధ్యం...?

మండో : అంటే? లంకా లక్ష్మీవైభోగం సంపద చూడలేనివారు, ఈర్ష్యాపరులు కక్షగట్టి ఇలా వ్యూహం పన్నారా?

రావ : కావచ్చు. లేకపోతే ఓ నరుడు వానరుల సాయంతో యుద్ధానికి రావడం.. అదీ ఓ ఆడదాని కోసం...

మండో : స్వామీ సీతను అప్పగిస్తే ఈ మారణహోమం ఆగుతుంది. లంక స్వర్ణలంకగా సర్వసంపదలతో ఉంటుంది.

ఈ లంకానగరం స్వర్గశోభితం. పూలు, పండ్లు, పక్షులు, ఇంటింటా సంగీతవాద్యాల సుమధుర సంగీతం, నృత్యగానాలు, ఈ లంక సమస్త లోకాలకూ కనువిందు చేసేది. కానీ, ఈనాడు, ఆక్రందనలు, ప్రతి ఇంటా శోకం, మరణం, భర్తను కోల్పోయిన భార్యలు, బిడ్డల మరణంతట్టుకోలేని తల్లులు, అంతా అనాథలమయం. అంతా శ్మశానం. ఆలోచించండి, ఒక్క స్త్రీకోసం ఇంత వినాశనం అవసరమా!

రావ : మండోదరీ! సీత ఓ కారణం అంతే. దేవదానవుల మధ్య వైరం ఈనాటిది కాదు. ఆధిపత్యంకోసం, రాక్షసజాతి వినాశనంకోసం జరుగుతున్నదీ యుద్ధం. కల్పవృక్షం–ఐరావతం–పుష్పక విమానం ఇలా సమస్త లోకాలలోని ప్రశస్తమైన సంపదలన్నీ తెచ్చి ఈ లంకను స్వర్ణలంకగా మార్చాను. నా కీర్తి, వైభోగం దశదిశలా వ్యాపింపజేసి దశకంఠుడని పేరుగాంచాను. ఇంత కాలం నా చేతలకు, ఆలోచనలకు ఆటంకం కలుగలేదు. కానీ ఇప్పుడు...

మండో : సీతను అప్పగించండి.

రావ : మండోదరీ! ఈ రావణబ్రహ్మ అపజయాన్ని కోరి వరించమంటావా వీరపత్నివి.

మండో : స్వామీ మనస్సు మర్కటం కదా? ఒక కోరిక తర్వాత మరొకటి, దీనికి అంతెక్కడ నిగ్రహించుకోండి. కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, సేనాపతి ప్రహస్తుడు, నికుంభుడు, విరూపాక్షుడు, వజ్రదంతుడు, ధూమ్రాక్షుడు, ఇలా రాక్షస వీరులంతా హతులయ్యారు. మన బలం, బలగం క్షీణించింది. ఎటుచూసినా ఆక్రందనలు, నగరమంతా శ్మశాన భూమిలా ఉంది. స్వామీ, ఇంతటి వినాశనానికి కారణం? ఆ సీత.

రావ : ఆ సీతను తెచ్చిన ఈ రావణుడు. అంతేనా దేవి.

మండో : సీతను మోహించారా...కామించారా...ఎందుకపహరించారు..?

రావ : ఆమె అపురూప సౌందర్యరాశి, అయోనిజ, అపరంజిబొమ్మ.

మండో : అనుభవంలోకిరాని స్త్రీ సౌందర్యం, స్త్రీ సాహచర్యం పొందని మీ ప్రయత్నం వృథా కదా...

రావ : కావచ్చు మండోదరీ! ఇంత జరిగాక ఇప్పుడు వెనకడుగు వెయ్యను. విజయమో, వీర స్వర్గమో అంతే.

మండో : స్వామీ వీరపత్నిని, వీరమాతను. సదా మీ క్షేమం, విజయమే కోరుకుంటాను.

రావ : మంచిది. తెల్లవారితే ఎవరి బ్రతుకు తెల్లవారుతుందో తెలుస్తుంది. ఈ రాత్రి శివనామస్మరణతో గడుపుతాను.

మండో : నాదో కోరిక



రావ : అడుగు...నాకు శక్తి, సౌభాగ్యం, సంపద అన్నీ నీవే. అడుగు.

మండో : ఆ నరుడు రాముడు ఎలా ఉంటాడో చూడాలని ఉంది.

రావ : నా శక్తి మీద అపనమ్మకమా, లేక అతడి మీద అభిమానమా...

మండో : ఏదీ కాదు, మహాయోధులు మిమ్మల్ని నిలువరించిన అతడిని చూడాలని ఉంది. అతడు నిజంగా నరుడా లేక...

రావ : ఇంక అతగాడి ప్రస్తావన వద్దు వెళ్లు...కానీ, పతిభిక్ష మాత్రం కోరకు...ఏం...

మండో : అడగను సరా...(వెడుతుంది)

రావ : హరహరమహాదేవ శంభోశంకరా!

(నేపథ్యంలోంచి (విభీషణుడి వాయిస్‌రూపంలో) రాజేంద్రా!

రావ : ఎవరు... ఎవరదీ..?

విభీ : నేను నీ సోదరుడిని నాగొంతు గుర్తుపట్టలేదా విభీషణుడిని.

రావ : మళ్లీ ఎందుకొచ్చావు. నీ ముహం నాకు చూపించకు. (నాటకీయతకోసం ఈ సన్నివేశం)

విభీ : సోదరా! నా హితం విను. (క్షణం నిశ్శబ్దం) అగ్రజా సీతనెందుకు కోరుకున్నావు. ఆమె వక్షఃస్థలమే పడగ. ఆమె చింతే విషం. ఆమె మందహాసం కరకు కోరలు. ఆమె ఐదు చేతివేళ్లు అయిదు తలలు. సీత నీ పాలిట సర్పం అది గుర్తుంచుకో.

రావ : లంకానగరానికి నీవు ద్రోహివి రాజ్యకాంక్షతో లంకకు చేటు తెచ్చావు.

విభీ : నీ హితమే నే కోరేది.

రావ : వీభీషణా ! ఆగర్భ శత్రువులతో, కాలసర్పంతో కలిసి ఉండవచ్చు. కానీ జ్ఞాతులు ఆపదలకు మూలం. గోవులలో క్షీరం,

బ్రాహ్మణులలో దమం, స్త్రీలలో చపలత్వం ఉంటుంది. కానీ, జ్ఞాతులకు భయంకరమైన ద్వేషం, అసూయ, పగ ఉంటాయి. నీవల్ల లంక సర్వనాశనమైంది. ఇక నీతో మాట్లాడను వెళ్లు లేదా ఇప్పుడే నిన్ను చంపుతాను.

విభీ : రాజేంద్రా! నాకు జ్యేష్ఠభ్రాతవు, తండ్రితో సమానం. కానీ ధర్మ బాహ్యుడవయ్యావు. నీకిక మరణమే, తథ్యం.

(వాయిస్ ఆగిపోయింది)

రావ : విభీషణా! మరణం, నాకు మరణమా!? నావైపు అష్టదిక్పాలకులే కన్నెత్తి చూడలేరు. అలాంటి నాకు మరణమా? అసురుల వల్ల, దేవతల వల్ల నాకు మరణం లేదే...ఇప్పుడే వెళ్లి సీతను హతమారుస్తాను. అప్పుడు విజయం నాదేగా. ఈ నరులు వానరులు ఇంకేం చేస్తారు. (నవ్వుతాడు)

(నేపథ్యం వాయిస్)

దశగ్రీవా! కుబేరుడి తమ్ముడివి, క్రోధం, ఆవేశం, మత్సరంతో సీతను చంపుతావా... వేద విద్యా పారంగతుడివి, స్వకర్మనిరతుడివి, స్త్రీవధ చేస్తావా..? సీత నీకు వశమయ్యే ఉపాయం ఆలోచించు, నీ ప్రతాపం రాముడిపై చూపు, ఇవ్వాళ కృష్ణ చతుర్దశి. లే... యుద్ధానికి బయల్దేరు. అమావాస్య ఘడియల్లో రాముడిని సంహరించు జయం నీదే.

రావ : (సంతోషంతో) అమాత్యా...సుపార్శ్వుడా చక్కటి ఆలోచన ఇదే అదను.

(రావణుడు శివస్తోత్రం చేస్తాడు స్తోత్రం పూర్తవుతుండగా హేళనగా నవ్వు... రావణుడు క్షణం నివ్వెరపోయి)

ఎవడు... ఎవడురా అది...?



నేపథ్యం : నేను! శనిదేవతను.

రావ : శనిదేవతా? నువ్వు గ్రహానివి. ఎంత ధైర్యం రా? నన్ను చూసి నవ్వేంత సాహసం ఎలా వచ్చింది. రా...నా ముందుకు.

శని : తప్పదా? రావణబ్రహ్మ! ఇన్నాళ్లూ నీ అవిక్రమ పరాక్రమానికి ఝుడిసి నీ రూపం చూడలేదు. కానీ..

రావ : రా...నా ముందుకు...రా...నాకు ఆగ్రహం తెప్పించకు...రా...

(శని ప్రవేశం)

ఇన్నాళ్లూ నా చెప్పుకింద తలవంచుకున్న గ్రహానివి ఇవాళ నీకింత ధైర్యం ఎలా వచ్చింది?

శని : నిన్ను చూడాలని ఎన్నాళ్లగానో కోరిక. నీ రూపలావణ్యాలు, సర్వలోకాలను, సర్వదిక్పాలకులను, జీవకోటినీ నియంత్రించిన నీ సౌందర్యం, శరీర సౌష్ఠవం చూడాలన్న కోరిక ఈనాడు తీరింది. ధన్యుడని. రేపు చూడలేనేమో!

రావ : శనీ...నిన్ను చూసిన పరమశివుడే కైలాసం వదిలి చెట్టు చాటున దాక్కున్నాడని విన్నా. రాముడితో యుద్ధానికి వెడుతున్న సమయంలో నాకు ఎదురొచ్చావు. ఇది శుభమా, అశుభమా?

శని : నిజం చెప్పనా? నీకు జయం.

రావ : సత్యమేనా?

శని : నీవు గెలిస్తే జయం.

రావ : రాముడు గెలిస్తే..?

శని : విజయం.

రావ : జయం నాకు, విజయం రాముడికి ఎలా

శని : అర్థం కాలేదా? ఆలోచించు. పరమశివుని ఏం వరం కోరావు? నరులు, వానరులు నిన్నేమి చేయలేరని, మిగతావారివల్ల మరణం రాకుండా వరం కోరావు కదా.

రావ : అవును.

శని : కానీ ఈనాడు ఆ నరవానరులే నిన్ను యుద్ధంలో ఎదుర్కొని నీ మరణానికి కారకులవుతున్నారు. ఇదెలా సాధ్యం. ఆలోచించు.

రావ : అంటే రాముడు!

శని : ఆదినారాయణుడు.

రావ : అనుకున్నా... ఓ నరుడు ఇంత పరాక్రమశాలి ఎలా అయ్యాడా..! అని. ఆలోచించలేదు అర్థమైంది. శనీ! నీ మాట సత్యం జయం నాదే.

శని : కానీ విజయం రాముడిది.

రావ : సర్వలోకాలను సర్వదేవదానవ కిన్నెర కింపురుషాది దైత్యులను మునిజన రాజాధిరాజులను నియంత్రించి లంకానగరాన్ని సర్వసంపదలు, శోభలతో నిర్మించిన నన్ను చంపటానికి ఆదినారాయణుడే నరుడి రూపంలో నా లంకకు రావడం నిజంగా నాకు జయం.

శని : అంతేగాదు కోదండపాణి చేతిలో మరణించడం నీకో యోగం కదా.

రావ : అవును. ఎన్నో జన్మలు, ఎన్నెన్నో అనుభవాలు, అనుభూతులు, సంయోగవియోగాలు అన్నిటికీ జయం అవునా...

శని : అభీష్టం నెరవేరుగాక (శని వెళ్లబోతుండగా)



రావ : అటుపోకు. అది నాదేవి మండోదరి అంతరంగిక మందిరం. (శనిమరో ప్రక్కగా పోతాడు. క్షణం తర్వాత మండోదరి ప్రవేశం హారతితో)... దేవీ ఆ నరుడిని చూశావా..?

మండో : ఆ...మర్యాద రాముడు. నన్ను ఎంతో వాత్సల్యంతో ఆదరించాడు.

రావ : మర్యాద రాముడా!?

మండో : అవును. మర్యాద రాముడే. నా నీడ తన మీద పడగూడదని విశ్రమిస్తున్న రాముడు లేచి నిల్చున్నాడు.

రావ : ఆ తర్వాత...

మండో : నేను రావణబ్రహ్మ భార్య మండోదరిని. పరమ తపస్సంపన్నుడు, మహేశ్వర వరప్రసాది, అజేయుడు అయిన నా భర్తపై యుద్ధానికి వచ్చిన వీరుడిని చూడాలని వచ్చాను. పరస్త్రీ నీడను కూడా తాకనివ్వని ఏకపత్నీవ్రతుడవైన నువ్వు పరస్త్రీలోలుడయిన నా భర్తను ఎదుర్కొనడానికి వచ్చిన నీకు వందనం, అనగానే. తల్లీ! పంచకన్యలలో అహల్య, తార, దర్శనం అయింది. సీత నా భార్య అయింది. నీ దర్శనం ఎలాగా అని యోచిస్తున్నాను. నన్ను అనుగ్రహించావు. మాతా! సుమంగళిగా కలకాలం ఉండు. అన్నాడు.

రావ : నిజమా ఐతే జయం నాదే.

(రావణుడు బయలుదేరుతుండగా యుద్ధభేరీలు శంఖనాదాలు సూర్యోదయం)

ఓ పక్క శ్రీరాముడు... ... మరో పక్క రావణుడు

శ్రీరాముడు ఆదిత్య హృదయం చదువుతుండగా...
మరో ప్రక్క రావణుడు శివస్తోత్రం చదువుతుంటాడు.

రావ : రామా! నీవు నరుడవు కావు, ఆదినారాయణుడివి. నన్ను అనుగ్రహించడానికి వచ్చావా స్వామీ...

(యుద్ధం... రావణుడు పరాజితుడు... హనుమంతుడు–సుగ్రీవుడు–లక్ష్మణుడు ప్రవేశం...)

(రావణుడి ప్రవేశం–బాణంతో దెబ్బతిని వచ్చాడు)

నిరంతర శివదీక్షాతత్పరుడిని – పులస్త్య బ్రహ్మ పౌత్రుడిని, విశ్వావసువు కుమారుడిని సర్వలోక విజేతను–నన్ను సంహరించడానికి కోదండపాణి...! గర్భస్థ అమృత భాండాన్ని నాశనం చేశావు. దశకంఠుడిని మరణశయ్యపైకి నెట్టావు. నేను చేసిన ద్రోహం ఏమిటీ..? సీతాపహరణం అంతేనా..? రామా..! నువ్వు నా లంకకు రావాలి. అందుకే సీతపహరణ చేశాను. నిన్ను రప్పించాను. ఇది నాకు జయం. రామా..! నీ ద్వార పాలకుడిని నేను. శాపగ్రస్తుడిని అయ్యాను. నీ వియోగం పొందాను. మూడుజన్మలకు నీ నుండి దూరంగా పంపావు. అది భరించలేక నీ వియోగం సహించలేక ఈ పని చేశాను.

ధన్యోస్మి రామా..! నీ కోదండం నన్ను బలిగొంది. ఇది చాలు నాకు. నాకు పునర్జన్మలేకుండా శాశ్వత జీవన్ముక్తి ప్రసాదించు.

(పడిపోతాడు)

సుగ్రీ : కోదండపాణీ! రావణబ్రహ్మ మరణించాడు. శ్రీరామా నీకు జయం.

హను : జయహెూ సీతాపతీ...రామచంద్రప్రభో నీ కోదండం సకల రాక్షసజాతిని సంహరించి, నరవానరులకు జయం చేకూర్చింది.

లక్ష్మణుడు : అన్నా...అలా మౌనంగా ఉన్నావేం.



శ్రీరామ : ఈ విజయం సత్యధర్మాలది. "అహం బ్రహ్మోస్మి" అని రావణబ్రహ్మ విర్రవీగాడు. అందుకే అతడు హతుడయ్యాడు. విభీషణా...

లక్ష్మణుడు : అదిగో అక్కడ. సోదరుడి మరణానికి చింతిస్తున్నాడు.

శ్రీరామ : లక్ష్మణా, సుగ్రీవా అతడికి చెప్పండి. సకలశాస్త్ర పారంగతుడు, వ్యాకరణం, సంగీతశాస్త్ర మహిమాన్వితుడైన రావణబ్రహ్మకు అంతిమసంస్కారాలు యథావిధిగా నిర్వర్తించమనండి. మరొక విషయం. మరణం తర్వాత శత్రుత్వం ఉండదు. అందరూ మిత్రులే. హనుమా! మండోదరిని ఓదార్చు. (రామబాణ రామాయణం)

(అందరూ వెడుతుండగా)...(లైట్సాప్)

(కీర్తనాచార్యుడు – శిష్యుడు)

శిష్యుడు : స్వామీ! శ్రీరాముడు సమస్త లోకాలకు రాక్షసబాధ లేకుండా చేశాడు. శుభం. కానీ సీత మహాసాధ్విని. అగ్నిప్రవేశం చేయించడం...

కీర్తనా : సీత... బంగారు లేడి ఉండదని తెలిసి కూడా చాపల్యంతో ఆ బంగారులేడిని ఆశించింది. రావణుడు ఆమెను తాకాడు. అశోకవనంలో బంధించాడు. అందుకే ఆమెను అగ్నిప్రవేశం చేయించి పునీతను చేశాడు. బంగారానికి అగ్ని స్పర్శతో మెరుపు లభిస్తుంది కదా...

శిష్య : మరి మండోదరికి సుమంగళీత్వం...

కీర్త : శ్రీరామ దర్శనం మండోదరికి కలిగిన మహాద్భాగ్యం. ఆమె పంచకన్యలలో ఒకతి. కన్యకు బొట్టు, కట్టు, పూలు, సొమ్ములు–వివాహానికి ముందు, ఆ తర్వాత జన్మతః ఉండే అలంకారాలు.

భర్త వల్ల వచ్చిన మంగళసూత్రం ఒక్కటే స్త్రీ కోల్పోయేది. అందుకే మండోదరి సుమంగళి.

శిష్యుడు : రావణకాష్టం ఆరదనీ, ఆరేదాకా ఆమె సుమంగళేనని వాడుక కదా...

కీర్తనా : రామ కథ ఉన్నంత కాలం రావణుడుంటాడు. అదే రావణకాష్టం. ప్రపంచంలో తెగని సమస్యకు రావణకాష్టం అనడం ఆచారం, ఆనవాయితీ అంతే...

శ్రీ మహిమాభిరాముడు వశిష్ఠమహాముని పూజితుండు - సు
త్రా మవధూ కళాదరణ రక్షకుడాశ్రిత పోషకుండు - దూ
ర్వాసుల సన్నిభాంగుడు మహాగుణశాలి-శ్రీ
రాముడు ప్రోచుభక్తి - తతి రంజిల్లునట్లుగ నెల్లకాలమున్
ఇది కోదండపాణి - కథ - అస్తు శుభమస్తు - మంగళం ॥

(శ్రీరామ పట్టాభిషేకం-శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు పాత్రధారులంతా రంగస్థలంపై ఉండగా)

రామచంద్రాయ జనక రాజజా మనోహరాయ
మామకాభీష్టదాయ మహిత మంగళం
కౌసలేంద్రాయ మందహాస దాసపోషణాయ
వాసవాది వినుత సద్వరద మంగళం
చారు కుంకుమోపేత చందనాను చర్చితాయ
హారకటక శోభితాయ భూరి మంగళం
లలిత రత్నకుండలాయ తులసీ వనమాలికాయ
జలజ సద్రుశ దేహాయ చారుమంగళం ॥
॥ శుభం ॥

లైట్సాఫ్ ... ... సమాప్తం.

* * *



## ఆధార గ్రంథాలు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - రామాయణం శ్రీ ఇలపావులూరి పాండు రంగారావు రచనలు-వాల్మీకి-రామాయణంలో స్త్రీపాత్రలు.

శ్రీవిశ్వనాథ అచ్యుతదేవరాయలు - నవల - గోపీనాథ రామాయణం - వాల్మీకి రామాయణం తులనాత్మక పరిశీలన.

* * *